# శుభోదయం

ప్రతీ అక్షరం..ప్రజా సమరం......!

WWW.SUBHODAYAMDAILY.COM

అమరావతి,హైదరాబాద్, సంపుటి : 02, సంచిక : 47, పేజీలు : 08, ఎడిటర్ : వి. శ్రీనివాసరావు (6281773157) మంగళవారం -06 - మే - 2025


## ప్రధాని మోదీకి రష్యా అధ్యక్షుడు పుతిన్ ఫోన్...
## పూర్తి మద్దతుగా ఉంటామని హామీ



పహల్గామ్ ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించిన పుతిన్

దాడికి పాల్పడిన వారిని, వారికి మద్దతు ఇచ్చిన వారిని శిక్షించాలన్న రష్యా అధినేత

భారత్, రష్యా మధ్య దశాబ్దాలుగా కొనసాగుతున్న బలమైన మైత్రి

2

## ప్రధాని మోదీతో రక్షణ కార్యదర్శి భేటీ



పాకిస్తాన్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రధాని మోదీతో రక్షణ కార్యదర్శి భేటీ

ఏప్రిల్ 22 పహల్గామ్ దాడి అనంతరం భద్రతా పరిస్థితి, సైనిక సన్నద్ధతపై చర్చ

పశ్చిమ సరిహద్దుల్లో తాజా పరిస్థితిని ప్రధానికి వివరించిన రక్షణ కార్యదర్శి

## పాకిస్థాన్‌కు షాక్ మీద షాక్..
## చీనాబ్ డ్యామ్‌లపై భారత్ కీలక చర్యలు

2లో



చీనాబ్ నదిపై సలాల్, బాగ్లిహార్ డ్యామ్‌ల నీటి నిల్వ సామర్థ్యం పెంపునకు భారత్ చర్యలు

పహల్గామ్ దాడి తర్వాత పరిణామంగా జాతీయ మీడియా కథనాలు

ఒక రిజర్వాయర్‌లో పూడికతీత ప్రక్రియ పూర్తి చేసిన ఎన్‌హెచ్‌పీసీ

## అకాల వర్షాలతో అపార నష్టం..
## రైతులకు బాసటగా వైఎస్సార్‌సీపీ: వైఎస్ జగన్

- ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే రైతులు నష్టపోయారు: జగన్
- వర్షాలపై సమాచారం ఉన్నా ప్రభుత్వం పట్టించుకోలేదన్న మాజీ సీఎం
- అకాల వర్షాలకు నష్టపోయిన రైతులను పరామర్శించాలని పార్టీ నేతలకు సూచన
- రైతులకు పరిహారం చెల్లించాలంటూ ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని నిర్ణయం

వివరాలు 2లో..



## రైతులకు, కౌలు రైతులకు
# గుడ్ న్యూస్ చెప్పిన ఏపీ ప్రభుత్వం

- 'అన్నదాత సుఖీభవ' పథకం కౌలు రైతులకు విస్తరణ
- ప్రతి అర్హులైన రైతు కుటుంబానికి రూ. 20,000 ఆర్థిక సాయం
- మూడు విడతల్లో లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ
- మే 20వ తేదీలోగా 'అన్నదాత సుఖీభవ' అధికారిక వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని స్పష్టం చేసింది






అమరావతి : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రైతుల సంక్షేమం దిశగా మరో కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో భూ యాజమాన్య హక్కు లేకున్నా, ఇతరుల భూములను కౌలుకు తీసుకుని సేద్యం చేస్తున్న కౌలు రైతులకు కూడా ఆర్థిక భరోసా కల్పించాలని సంకల్పించింది. ఇప్పటికే అమలులో ఉన్న 'అన్నదాత సుఖీభవ' పథకాన్ని కౌలు రైతులకు సైతం వర్తింపజేస్తున్నట్లు ప్రకటించింది. ఈ పథకం కింద అర్హులైన ప్రతి రైతు కుటుంబానికి ఏటా రూ. 20,000 ఆర్థిక సహాయం అందించాలని నిర్ణయించింది. ఈ మొత్తాన్ని మూడు విడతలుగా నేరుగా మిగతా..2లో

## వైసీపీ ఓటమికి చాలా కారణాలు ఉన్నాయి బొత్స సత్యనారాయణ

2



- కూటమి ప్రభుత్వం ఏడాదిలోనే రూ. 1.50 లక్షల కోట్ల అప్పు చేసిందన్న బొత్స
- అభివృద్ధి, సంక్షేమాన్ని జగన్ రెండు కళ్లుగా చూశారని కితాబు
- మూడు టీవీ ఛానళ్లు, పేపర్లతో చంద్రబాబు పబ్బం గడుపుకుంటున్నారని విమర్శ

## సీమరాజా, కిర్రాక్ ఆర్పీలపై పోలీసులకు ఫిర్యాదు చేసిన అంబటి రాంబాబు



ఐటీడీపీపై అంబటి రాంబాబు ఫైర్

తమపై తప్పుడు పోస్టులు పెడుతున్నారంటూ ఆగ్రహం

పోలీసులు చర్యలు తీసుకోకపోతే సుప్రీంకోర్టుకైనా వెళతామని స్పష్టం

ఆ కేసు తానే వాదిస్తానని వెల్లడి

2



## సీఎం చంద్రబాబుకు కేశినేని నాని లేఖ...
## లిక్కర్ స్కామ్ లో తమ్ముడిపై తీవ్ర ఆరోపణలు

లిక్కర్ స్కామ్‌లో అరెస్టయిన వ్యక్తులతో చిన్నికి సంబంధాలున్నాయన్న నాని

రాజ్ కసిరెడ్డితో చిన్నికి, ఆయన భార్యకు వ్యాపార భాగస్వామ్యం ఉందని ఆరోపణ

చిన్నిపై ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించాలని డిమాండ్

## మిస్ వరల్డ్ పోటీలు... హైదరాబాద్ కు చేరుకుంటున్న అందాల భామలు

2



- 120 దేశాల నుంచి సుందరీమణులు, ఇప్పటికే పలువురి రాక ప్రారంభం
- శంషాబాద్ విమానాశ్రయంలో ఘన స్వాగత ఏర్పాట్లు, ప్రత్యేక డెస్క్‌లు
- తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా ఏర్పాట్లు చేసిన పర్యాటక శాఖ

# ఎవరిమీద మీ సమరం?..
# ఉద్యోగ సంఘాలపై సీఎం రేవంత్ ఆగ్రహం

- ఉద్యోగులంతా మా కుటుంబ సభ్యులే.
- ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పుడు సహకరించాల్సిన బాధ్యత ప్రభుత్వ సంఘాలకు లేదా
- మీ అందరికీ విజ్ఞప్తి చేస్తున్నా తెలంగాణను మళ్లీ కోతుల గుంపుకు అప్పగించొద్దు
- మీ సమరం తెలంగాణ ప్రజలపైనా?
- నాతో కలిసి రండి.. తెలంగాణను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళదాం

ప్రభుత్వం అంటే మేం ఒక్కరమే కాదు.



హైదరాబాద్: ఉద్యోగ సంఘాలపై సీఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సమరం అంటున్నారు.. ఎవరిమీద?. ప్రభుత్వం అంటే మేం ఒక్కరమే కాదు. ఉద్యోగులంతా మా కుటుంబ సభ్యులే. మీకు జీతాలు ఇస్తున్న ప్రజలే మాకు ఉద్యోగాలిస్తున్నారు. మిగతా..2లో

వివరాలు 2లో..



## హైదరాబాద్ ట్రాఫిక్ సమస్యలు తగ్గించేందుకు ఎన్నో ప్రాజెక్టులు చేపట్టాం: నితిన్ గడ్కరీ

- రూ. 3,900 కోట్ల విలువైన పలు రహదారుల ప్రాజెక్టులను ప్రారంభించిన గడ్కరీ
- పుణ్యక్షేత్రాలకు జాతీయ రహదారులతో అనుసంధానం చేస్తామన్న గడ్కరీ
- తెలంగాణ అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందని స్పష్టీకరణ

2



## సమ్మె వద్దు.. చర్చలకు రండి ఆర్టీసీ సంఘాలకు పొన్నం పిలుపు

సమ్మెకు వెళ్లవద్దని కార్మిక సంఘాలకు మంత్రి సూచన

ఆర్టీసీ పరిరక్షణ, కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు వెల్లడి

గత ప్రభుత్వం ఆర్టీసీని నిర్వీర్యం చేసిందని విమర్శ

కాంగ్రెస్ హయాంలో చేపట్టిన సంక్షేమ, నియామక చర్యల వెల్లడి

## 'ఆ చావులకు మీరేం సమాధానం చెబుతారు'

పెద్దపల్లి: మావోయిస్టులతో కేంద్రం చర్చలు జరిపే ప్రసక్తే లేదనే విషయాన్ని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, తెలంగాణ ఎంపీ బండి సంజయ్ మరోసారి స్పష్టం చేశారు.



2

## ఈ సమస్యపై భారత్, శ్రీలంక ప్రభుత్వాలు సామరస్యంగా పరిష్కరించుకోవాలి: పవన్ కల్యాణ్

తమిళనాడు మత్స్యకారుల ఘటనలపై పవన్ ఆందోళన

సమస్య పరిష్కారానికి భారత్, శ్రీలంక ప్రభుత్వాలు చర్చలు జరపాలని సూచన

మోదీ, చంద్రబాబుతో కలిసి అమరావతిని అభివృద్ధి చేస్తామని వెల్లడి

అమరావతి : బంగాళాఖాతంలో ఇటీవల తమిళనాడుకు చెందిన 24 మంది మత్స్యకారులు శ్రీలంక అధికారుల వల్ల ఇబ్బందులకు గురైన ఘటనలపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. నాగపట్నం జిల్లా మత్స్యకారులు గాయపడటం బాధాకరమని పేర్కొన్నారు. భారత్, శ్రీలంక మధ్య స్నేహపూర్వక సంబంధాలు ఉన్నాయని,



## భారత్-పాక్ ఉద్రిక్తతలు..
# మోదీకి కాల్ చేసిన పుతిన్

ఇంటర్నెట్‌డెస్క్: భారత్-పాక్ ఉద్రిక్తల నేపథ్యంలో ప్రధాని నరేంద్రమోదీకి రష్యా అధ్యక్షుడు పుతిన్ కాల్ చేశారు. పహల్గాం ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించారు. అలాగే ఉగ్రవాదంపై భారత్ జరుపుతోన్న పోరాటంలో తమ పూర్తిమద్దతు ఉంటుందని ప్రకటించారు. ఇరుదేశాల మధ్య ఉన్న ప్రత్యేక, వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలపేతం చేసేందుకు కట్టుబడి ఉన్నామని మోదీ, పుతిన్ పునరుద్ఘాటించారు. మే 9న రష్యా విక్టరీ డేను నిర్వహించుకోనుంది. దీనిపై అధ్యక్షుడికి మోదీ శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే ఈ ఏడాది రెండుదేశాల మధ్య వార్షిక సదస్సు భారత్‌లో నిర్వహించనున్నారు. అందుకోసం మన ప్రధాని ఆహ్వానం పలకగా.. పుతిన్ అంగీకరించారు. ఈ విషయాలను మన విదేశాంగ శాఖ వెల్లడించింది. పహల్గాంలోని బైసరన్ లోయలో ఏప్రిల్ 22న పర్యాటకులపై ఉగ్రవాదులు పాశవిక దాడికి పాల్పడిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ దాడికి తాము బాధ్యులమని పాక్ కేంద్రంగా ఉన్న లష్కరే తోయిబాకు చెందిన "ది రెసిస్టెన్స్ ఫ్రంట్" బాధ్యత ప్రకటించుకుంది. దీన్ని భారత ప్రభుత్వం గతంలోనే ఉగ్ర సంస్థగా ప్రకటించింది. ఇక ఈ ఘటన తర్వాత పాక్ నడ్డివిరిచేలా భారత ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఈ నేపథ్యంలో రెండు దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఈ ఉద్రిక్తతల వేళ.. ఐరాస భద్రతామండలి లో సమావేశం జరగనుంది. ఈ నేపథ్యంలోనే పుతిన్ ఫోన్ చేశారు. ఇంతకుముందు పహల్గాం ఘటన తర్వాత రాష్ట్రపతి ద్రౌపదీముర్ము, ప్రధాని మోదీకి పుతిన్ లేఖ రాశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఇలాంటి క్రూరమైన నేరానికి ఎలాంటి సమర్థన లేదని పేర్కొన్నారు.

## 'ఆ చావులకు మీరేం సమాధానం చెబుతారు?'

పెద్దపల్లి: మావోయిస్టులతో కేంద్రం చర్చలు జరిపే ప్రసక్తే లేదనే విషయాన్ని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి, తెలంగాణ ఎంపీ బండి సంజయ్ మరోసారి స్పష్టం చేశారు. ఈ మేరకు రామగుండంలో బండి సంజయ్ మాట్లాడుతూ.. తుపాకీ చేతపట్టి అమాయకులను చంపుతుంటే చర్చలేంటని సంజయ్ ప్రశ్నించారు. ఆ చావులకు మీరేం సమాధానం చెబుతారంటూ బండి సంజయ్ ఎదురు ప్రశ్నించారు. 'కాంగ్రెస్ రెండు నాల్కల ధోరణి ప్రదర్శిస్తోంది. మావోయిస్టులు దశాబ్దాలుగా అమాయకులను కాల్చి చంపిన సంగతి గుర్తు లేదా?, మావోయిస్టుల సానుభూతి పరులు సాధించిందేంటి?, మావోయిస్టులు ఎవరున్నా తుపాకీ వీడి లొంగిపోవాల్సిందే.. జన జీవన ప్రవంతిలో కలవాల్సిందే. పౌర హక్కుల సంఘం నేతలారా.. నక్సల్స్ నచ్చజెప్పండి' అని బండి సంజయ్ స్పష్టం చేశారు. ఇక తెలంగాణ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది కులగణన కానేకాదన్నారు బండి సంజయ్. కేవలం సర్వే మాత్రమే జరిగిందన్నారు. ఇక్కడ బీసీలకు తీవ్రమైన అన్యాయం చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం చేసింది కులగణన కానేకాదన్నారు. ప్రతి ఇంటికి కచ్చితంగా వెళ్లి నిర్వహించేది కులగణన అని అన్నారు. జనగణన మాదిరిగానే మోదీ ప్రభుత్వం కులగణన చేస్తుందన్నారు. బీసీలకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దుతామన్నారు బండి సంజయ్.

## మిస్ వరల్డ్ పోటీలు... హైదరాబాద్ కు చేరుకుంటున్న అందాల భామలు

హైదరాబాద్: ప్రతిష్ఠాత్మక 72వ మిస్ వరల్డ్ పోటీలకు ఆతిథ్యం ఇచ్చేందుకు తెలంగాణ రాజధాని హైదరాబాద్ సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. మే 7వ తేదీన ప్రారంభమై జూన్ 2 వరకు జరగనున్న ఈ అంతర్జాతీయ అందాల పోటీల కోసం నగరం వేదిక కానుంది. ప్రపంచవ్యాప్తంగా సుమారు 120 దేశాలకు చెందిన సుందరీమణులు ఈ పోటీల్లో పాల్గొనేందుకు ఇప్పటికే హైదరాబాద్‌కు తరలివస్తున్నారు. మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొనేందుకు వివిధ దేశాల నుంచి వస్తున్న అందగత్తెలతో శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో సందడి వాతావరణం నెలకొంది. విదేశీ ప్రతినిధుల రాక ఈరోజు నుంచి మరింత పెరగనున్న నేపథ్యంలో, వారికి తెలంగాణ సంప్రదాయ పద్ధతిలో ఘన స్వాగతం పలికేందుకు పర్యాటక శాఖ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేసింది. విమానాశ్రయంలో ప్రత్యేక లాంజ్‌లతో పాటు, సమాచారం అందించేందుకు ప్రత్యేక హెల్ప్ డెస్క్‌లను కూడా ఏర్పాటు చేశారు. తెలంగాణ పర్యాటక ప్రాంతాలు, సంస్కృతి, ప్రత్యేక చిహ్నాలతో కూడిన స్వాగత తోరణాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఇప్పటికే మిస్ బ్రెజిల్ జెస్సికా స్కాండుజ్ పెడ్రోసో, మిస్ సౌత్ ఆఫ్రికా జోయాలిజే జాన్సన్‌వాన్ రెన్స్‌బర్గ్ సహా దాదాపు 90 మంది పోటీదారులు హైదరాబాద్ చేరుకున్నారని నిర్వాహకులు వెల్లడించారు. విమానాశ్రయంలో పర్యాటక శాఖ అధికారులు వీరికి సాంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి, అనంతరం వారిని బస ఏర్పాటు చేసిన హెూటళ్లకు తరలించారు. ఇదిలా ఉండగా, ఈ పోటీలకు పాకిస్థాన్ నుంచి ప్రతినిధులు పాల్గొనడం లేదనే వార్తలు ప్రచారంలో ఉన్నాయి. ఇటీవల భారత్-పాకిస్థాన్‌ల మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో, పాకిస్థాన్ సుందరీమణులు ఈ పోటీలకు దూరంగా ఉంటున్నారని సమాచారం. పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత ఇరు దేశాల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయని, ఈ క్రమంలోనే పాకిస్థానీలు ఏప్రిల్ 29 నాటికి దేశం విడిచి వెళ్లాలని సూచనలు అందాయని, ఈ పరిణామాల నేపథ్యంలోనే మిస్ వరల్డ్ పోటీల్లో పాక్ ప్రాతినిధ్యం ఉండకపోవచ్చని తెలుస్తోంది. అయితే దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

## ఈ సమస్యపై భారత్, శ్రీలంక ప్రభుత్వాలు సామరస్యంగా పరిష్కరించుకోవాలి

మొదటి పేజి తరువాయి

తరచూ పునరావృతమవుతున్న ఈ తరహా ఘటనలను స్నేహపూర్వకంగా పరిష్కరించుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ విషయంలో తక్షణం జోక్యం చేసుకోవాలని విదేశాంగ మంత్రిత్వ శాఖను కోరారు. ఇరు దేశాల ప్రభుత్వాలు నిర్మాణాత్మక చర్చలు జరిపి, మత్స్యకారుల భద్రతకు, గౌరవానికి భంగం కలగకుండా చూడాలని పవన్ కళ్యాణ్ విజ్ఞప్తి చేశారు. పవన్ చేసిన ఈ వ్యాఖ్యలపై ప్రకాశ్ రాజ్ విమర్శించడం, ప్రకాశ్ రాజ్ వ్యాఖ్యలకు ఏపీ బీజేపీ నేత విష్ణువర్ధన్ రెడ్డి కౌంటర్ ఇవ్వడం తెలిసిందే.

ఏపీకి అమరావతే ఏకైక, శాశ్వత రాజధాని

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అమరావతే ఏకైక, శాశ్వత రాజధానిగా నిలుస్తుందని పవన్ స్పష్టం చేశారు. ఇది కేవలం కాంక్రీట్ నిర్మాణాల సముదాయం కాదని, ప్రజాస్వామ్యానికి, జవాబుదారీతనానికి, న్యాయానికి ప్రతీకగా ఉంటుందని ఆయన అన్నారు. రాజధాని కోసం భూములిచ్చిన రైతుల త్యాగాలను కొనియాడుతూ, గత ప్రభుత్వ హయాంలో వారు ఎదుర్కొన్న ఇబ్బందులను గుర్తుచేసుకున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు సహకారంతో అమరావతిని ప్రపంచస్థాయి రాజధానిగా తీర్చిదిద్దుతామని ఆయన హామీ ఇచ్చారు. యువత ఉద్యోగాల కోసం ఇతర నగరాలకు వలస వెళ్లే అవసరం లేకుండా అమరావతే ఉపాధి అవకాశాల కేంద్రంగా మారుతుందని ధీమా వ్యక్తం చేశారు. గత ఐదేళ్లలో రాజధాని రైతులు తీవ్రంగా నష్టపోయారని పవన్ ఆవేదన వ్యక్తం చేశారు. 29 వేలకు పైగా రైతులు 34 వేల ఎకరాలకు పైగా భూములను త్యాగం చేస్తే, గత ప్రభుత్వం వారి త్యాగాలను అవమానించిందని మండిపడ్డారు. రైతులు రోడ్లపైకి వచ్చి ముళ్ల కంచెల మధ్య ఆందోళనలు చేయాల్సి వచ్చిందని, లాఠీ దెబ్బలు తిని, కేసులు ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. ఎంతోమంది రైతులు ఈ క్రమంలో ప్రాణాలు కోల్పోయారని విచారం వ్యక్తం చేశారు. ఆనాడు రైతులు పడ్డ కష్టాలను ప్రధాని దృష్టికి తీసుకెళతామని, అమరావతే రాజధానిగా ఉంటుందని తాను హామీ ఇచ్చానని, నేడు ఆ మాట నిలబెట్టుకుంటున్నామని పవన్ కళ్యాణ్ తెలిపారు.

## ప్రధాని మోదీతో రక్షణ కార్యదర్శి భేటీ

ఢిల్లీ: పాకిస్తాన్‌తో ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో, రక్షణ శాఖ కార్యదర్శి రాజేష్ కుమార్ సింగ్ నేడు ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. ఏప్రిల్ 22న పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడి అనంతరం భారత్ తీసుకుంటున్న ప్రతిస్పందన చర్యలు, సైనిక సన్నద్ధతపై ఈ భేటీలో ప్రధానంగా చర్చ జరిగినట్లు తెలుస్తోంది. తాజా భద్రతా పరిస్థితి, ముఖ్యంగా పశ్చిమ సరిహద్దుల్లో సైనిక పరమైన ఏర్పాట్ల గురించి రక్షణ కార్యదర్శి ప్రధానికి వివరించినట్లు సమాచారం. ఒకేసారి బహుళ రంగాల్లో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనే వ్యూహాలు, రక్షణ సరఫరాలకు అంతరాయం కలగకుండా చూసే చర్యలపై కూడా చర్చ జరిగినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. గత వారం రోజులుగా ప్రధాని మోదీ త్రివిధ దళాధిపతులు, ఇతర ఉన్నతాధికారులతో వరుస సమావేశాలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ సమావేశం జరిగిన రోజే రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రధాని మోదీకి ఫోన్ చేసి, పహల్గామ్ దాడిని తీవ్రంగా ఖండించారు. ఉగ్రవాదంపై పోరులో భారత్‌కు పూర్తి మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు. మరోవైపు, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ జపాన్ రక్షణ మంత్రి జనరల్ నకతానితో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఉగ్రవాదంతో సహా ప్రాంతీయ భద్రతా సవాళ్లను ఎదుర్కోవడంలో భారత్‌కు సహకరిస్తామని జపాన్ పునరుద్ఘాటించింది. ఇదిలావుండగా, నియంత్రణ రేఖవెంబడి పాకిస్తాన్ గత 11 రోజులుగా కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూనే ఉంది. గత రాత్రి కుప్వారా, బారాముల్లా, పూంచ్, రాజౌరీ సహా పలు ప్రాంతాల్లో పాక్ దళాలు రెచ్చగొట్టే చర్యలకు పాల్పడ్డాయని భారత సైన్యం పేర్కొంది.

## వైసీపీ ఓటమికి చాలా కారణాలు ఉన్నాయి
## బొత్స సత్యనారాయణ

అమరావతి : గత ఎన్నికల్లో వైసీపీ ఓటమిపై ఆ పార్టీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణ కీలక వ్యాఖ్యలు చేశారు. కర్ణుడి చావుకు వంద కారణాలు ఉన్నట్టుగా... వైసీపీ ఓటమికి అనేక కారణాలు ఉన్నాయని చెప్పారు. అనకాపల్లి జిల్లాలో ఈరోజు వైసీపీ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి బొత్స, గుడివాడ్ అమర్ నాథ్, ధర్మశ్రీ, బూడి ముత్యాల నాయుడు, కన్నబాబు, వరుదు కల్యాణి, శోభ హైమావతి, బొడ్డేడ ప్రసాద్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బొత్స మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇదే సమయంలో ఆయన కూటమి ప్రభుత్వంపై విమర్శలు ఎక్కుపెట్టారు. కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలోనే రూ. 1.50 లక్షల కోట్లు అప్పు చేసిందని విమర్శించారు. మళ్లీ పెళ్లి అన్నట్టుగా అమరావతి పనులకు పునఃప్రారంభం చేశారని ఎద్దేవా చేశారు. అమరావతికి వచ్చిన మోదీ ఏం ఇచ్చారని ప్రశ్నించారు. కూటమి నేతల ప్రచార పిచ్చితో సింహాచలం ఆలయం వద్ద ఏడుగురు భక్తులు ప్రాణాలు కోల్పోయని అన్నారు. ఈ మరణాలన్నీ ప్రభుత్వం హత్యలేనని చెప్పారు. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి కొత్తగా ఒక్క పెన్షన్ కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా జగన్ చూశారని బొత్స అన్నారు. చంద్రబాబు తప్పుడు హామీలతో ప్రజలను మోసం చేశారని విమర్శించారు. కూటమి 11 నెలల పాలనలో ప్రజలకు ఒరిగింది శూన్యమని అన్నారు. రాష్ట్రానికి ఏం మేలు జరిగిందో ప్రజలు గమనించాలని చెప్పారు. మూడు టీవీ ఛానళ్లు, మూడు పేపర్లతో చంద్రబాబు పబ్బం గడుపుకుంటున్నారని దుయ్యబట్టారు.

## హైదరాబాద్ ట్రాఫిక్ సమస్యలు తగ్గించేందుకు ఎన్నో ప్రాజెక్టులు చేపట్టాం: నితిన్ గడ్కరీ




హైదరాబాద్ : తెలంగాణలో రహదారుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ స్పష్టం చేశారు. హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ సమస్యను తగ్గించేందుకు ఎన్నో ప్రాజెక్టులు చేపట్టామని అన్నారు. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లో పర్యటించిన ఆయన, సుమారు రూ. 3,900 కోట్ల విలువైన పలు జాతీయ రహదారుల ప్రాజెక్టులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ జిల్లాకు ఘనమైన చారిత్రక నేపథ్యం ఉందని, భూమి కోసం, భుక్తి కోసం పోరాడిన ఆదివాసీల గడ్డ అని ఆయన గుర్తుచేశారు. కాగజ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న గడ్కరీ, ఈ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రంలో రోడ్డు మార్గాల వ్యవస్థ మరింత పటిష్టం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా ప్రధానమంత్రి సడక్ యోజన కింద రోడ్ల నిర్మాణాన్ని కేంద్రం పెద్ద ఎత్తున చేపడుతోందని గుర్తుచేశారు. మెరుగైన రహదారులున్న దేశాలే అభివృద్ధి చెందిన దేశాలుగా గుర్తింపు పొందుతాయని పేర్కొన్నారు. దేశ ప్రగతికి వ్యవసాయం, ఉపాధి, రవాణా, మౌలిక వసతులు అనే నాలుగు అంశాలు మూలస్తంభాలని ఆయన అభిప్రాయపడ్డారు. తెలంగాణ అభివృద్ధి పట్ల కేంద్రానికి చిత్తశుద్ధి ఉందని చెబుతూ, రాష్ట్రంలో చేపట్టనున్న పలు కీలక ప్రాజెక్టులను గడ్కరీ ప్రస్తావించారు. సూర్యాపేట నుంచి దేవరపల్లి వరకు గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణం, నాగ్‌పూర్ నుంచి విజయవాడ వరకు కీలకమైన కారిడార్ పనులను చేపట్టనున్నట్లు వెల్లడించారు. వీటితో పాటు భద్రాచలం, బాసర, మేడారం వంటి ప్రముఖ పుణ్యక్షేత్రాలను జాతీయ రహదారులతో అనుసంధానించనున్నట్లు తెలిపారు. జగిత్యాల-కరీంనగర్ హైవే విస్తరణ పనులను కూడా త్వరలోనే ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ఈ ప్రాజెక్టులతో తెలంగాణ-మహారాష్ట్ర మధ్య రోడ్డు రవాణా మరింత సులభతరం కానుందని అన్నారు. రాష్ట్రాల మధ్య అనుసంధానాన్ని పెంచేందుకు కేంద్రం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని, ఇందులో భాగంగా జోజిలా పాస్ టన్నెల్ వంటి క్లిష్టమైన నిర్మాణాలను కూడా చేపట్టినట్లు వివరించారు. హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చేపట్టిన చర్యలను ప్రస్తావిస్తూ, నూతనంగా నిర్మించిన అంబర్‌పేట్ ఫ్లైఓవర్ ను కూడా నేడు ప్రారంభించనున్నట్లు తెలిపారు. పర్యావరణ పరిరక్షణ, రవాణా ఖర్చు తగ్గింపు లక్ష్యంగా పెట్రోల్ వాహనాలకు బదులుగా ఎలక్ట్రిక్, సీఎన్‌జీ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని సూచించారు. విద్యుత్ వాహనాల వినియోగం పెరిగితే రవాణా ఖర్చు గణనీయంగా తగ్గుతుందని నితిన్ గడ్కరీ తెలిపారు.

# అకాల వర్షాలతో అపార నష్టం..
## రైతులకు బాసటగా వైఎస్సార్‌సీపీ

గుంటూరు: ఏపీలో అధికార యంత్రాంగం మొత్తం నిస్తేజంలో ఉందని, రైతులు నష్టపోకుండా ప్రభుత్వం సరైన చర్యలేవీ చేపట్టలేదని వైఎస్సార్‌సీపీ అధినేత,మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. ఏపీలో అకాల వర్షాలపై పార్టీ రీజినల్ కో-ఆర్డినేటర్లు, ముఖ్యనాయకులతో సోమవారం వైఎస్ జగన్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. "కష్టకాలంలో ఉన్న రైతులకు అండగా నిలవాలి. అకాల వర్షాలు, ఈదురుగాలుల కారణంగా నష్టపోయిన రైతులను పరామర్శించండి.. వారికి ధైర్యం చెప్పండి. రాష్ట్రంలో పలుచోట్ల ధాన్యం తడిసిపోయింది. అనేక ఉద్యానవన పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఖరీఫ్‌లో ప్రతికూల వాతావరణం, కనీస మద్దతు ధరలు లభించక ధాన్య రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ రబీ సీజన్‌లో కూడా కష్టాలు పడటం ఆవేదన కలిగిస్తోంది. వర్షాలు కురుస్తాయన్న సమాచారం ముందస్తుగానే ఉన్నప్పటికీ కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించింది. కళ్లాల్లో, పొలాల్లో రైతులవద్దనున్న ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించడంలో తీవ్ర నిర్లక్ష్యం కనబరిచింది. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలు సహా పలు చోట్ల ప్రభుత్వం ధాన్యాన్ని సరిగ్గా సేకరించడంలేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పుడు అకాల వర్షాలవల్ల మరింతగా నష్టపోతున్నారు. యంత్రాంగం మొత్తం నిస్తేజంలో ఉంది. పంటలు దెబ్బతిన్న ప్రాంతాల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు క్షేత్రస్థాయిలో పర్యటనలు చేయాలి. రైతులకు బాసటగా నిలవాలి. రైతులను ఆదుకునేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలి అని కేడర్‌కు వైఎస్ జగన్ సూచించారు.

## సీఎం చంద్రబాబుకు కేశినేని నాని లేఖ...
## లిక్కర్ స్కామ్ లో తమ్ముడిపై తీవ్ర ఆరోపణలు

అమరావతి : రాజకీయంగా బద్ధ శత్రువులుగా మారిన కేశినేని సోదరుల మధ్య ఆరోపణల యుద్ధం మరింత తీవ్ర రూపం దాల్చింది. విజయవాడ మాజీ ఎంపీ, వైసీపీ నేత కేశినేని నాని తన సోదరుడు, ప్రస్తుత టీడీపీ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)పై సంచలన ఆరోపణలు చేస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు లేఖ రాశారు. ఏపీలో ప్రకంపనలు సృష్టిస్తున్న మద్యం కుంభకోణంలో అరెస్టయిన కీలక వ్యక్తులతో కేశినేని చిన్నికి సంబంధాలున్నాయని నాని ఆరోపించారు. ఈ మేరకు రాసిన లేఖను ఆయన ఎక్స్ వేదికగా పంచుకున్నారు. మద్యం కుంభకోణంలో అరెస్టయిన కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, ఆయన సన్నిహితుడు దిలీప్ పైలాలతో కేశినేని చిన్నికి సంబంధాలున్నాయని చెప్పడానికి తన వద్ద విశ్వసనీయ సమాచారం ఉందని నాని తన లేఖలో పేర్కొన్నారు. లిక్కర్ స్కామ్‌లో ప్రధాన నిందితుడిగా ఉన్న కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, ఎంపీ కేశినేని చిన్ని, ఆయన భార్య జానకీ లక్ష్మీతో కలిసి 'ప్రైడ్ ఇన్‌ఫ్రాకాన్ ఎల్ఎల్‌పీ' అనే సంస్థలో భాగస్వాములుగా ఉన్నారని నాని తెలిపారు. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్, ప్లాట్ నెం.9, సర్వే నెం.403 చిరునామాతో ఈ సంస్థ నమోదైందని ఆయన వివరించారు. ఇదే సమయంలో కసిరెడ్డి, దిలీప్ పైలా నిర్వహిస్తున్న 'ఇషాన్వి ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్' కూడా ఇదే చిరునామాతో కార్యకలాపాలు సాగిస్తోందని నాని ఆరోపించారు. ఈ రెండు సంస్థలు ఒకే అధికారిక ఈ-మెయిల్ ఐడీని వినియోగిస్తున్నాయని ఆయన తెలిపారు. ఇది రెండు సంస్థల మధ్య ఉద్దేశపూర్వక కార్యాచరణ సంబంధాన్ని స్పష్టం చేస్తోందని అన్నారు. ఇప్పటికే ఈ కేసులో ఇద్దరు కీలక వ్యక్తులు అరెస్టయిన నేపథ్యంలో, సిట్టింగ్ ఎంపీకి వారితో ప్రత్యక్ష సంబంధాలుండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని నాని పేర్కొన్నారు. మద్యం కుంభకోణంతో సంబంధం ఉన్న నిధులను పెద్ద మొత్తంలో కేశినేని చిన్ని అక్రమంగా హైదరాబాద్ రియల్ ఎస్టేట్, విదేశీ కంపెనీలలో పెట్టుబడులుగా మళ్లించారని తనకు సమాచారం ఉందని ఆరోపించారు. ఈ వ్యవహారంలో లెక్కల్లో చూపని సంపదను దాచిపెట్టడానికి, మనీ లాండరింగ్‌కు పాల్పడి ఉండవచ్చనే అనుమానాలను ఆయన వ్యక్తం చేశారు. ఈ ఆరోపణలపై ముఖ్యమంత్రి చంద్రబాబు తక్షణమే జోక్యం చేసుకుని, ఉన్నత స్థాయి దర్యాప్తునకు ఆదేశించాలని కేశినేని నాని డిమాండ్ చేశారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని జరిగే ఇలాంటి అక్రమాలను, నిందితులతో సంబంధాలను విచారించకుండా వదిలివేయకూడదని ఆయన కోరారు. రాజకీయ పలుకుబడి చట్టానికి, జవాబుదారీతనానికి అడ్డుకాకుండా చూడాలని, నిర్ణయాత్మక చర్యలు తీసుకుని న్యాయాన్ని నిలబెట్టాలని సీఎంకు రాసిన లేఖలో నాని విజ్ఞప్తి చేశారు. గతంలో విశాఖ భూ కేటాయింపుల విషయంలోనూ కేశినేని నాని తన సోదరుడు చిన్నిపై ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు లిక్కర్ స్కామ్ ఆరోపణలతో ఈ సోదరుల మధ్య వివాదం మరింత ముదిరినట్లయింది.

## సమ్మె వద్దు.. చర్చలకు రండి
## ఆర్టీసీ సంఘాలకు పొన్నం పిలుపు

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీఎస్‌ఆర్టీసీ) ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉందని, చర్చల ద్వారా వాటిని పరిష్కరించుకుందామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. సమ్మె ఆలోచన విరమించుకోవాలని ఆర్టీసీ కార్మిక సంఘాల నేతలకు సూచించారు. హైదరాబాద్‌లో పలువురు ఆర్టీసీ కార్మిక సంఘాల నాయకులు మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి తమ ఇబ్బందులను, డిమాండ్లను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఆర్టీసీ కార్మికుల సమస్యలను వినడానికి ముఖ్యమంత్రితో పాటు తాను ఎప్పుడూ అందుబాటులో ఉంటామని హామీ ఇచ్చారు. సంస్థ పరిరక్షణ, కార్మికుల సంక్షేమం, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే తమ ప్రభుత్వ ప్రాధాన్యతలని పునరుద్ఘాటించారు. ఆర్టీసీ క్రమంగా నష్టాల నుంచి గట్టెక్కుతోందని, సమస్యలు కూడా తగ్గుముఖం పడుతున్నాయని మంత్రి వివరించారు. ఇలాంటి కీలక సమయంలో సిబ్బంది సమ్మెకు దిగితే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడతారని, సంస్థపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతుందని ఆయన అన్నారు. గత పదేళ్ల పాలనలో మునుపటి ప్రభుత్వం ఆర్టీసీని పూర్తిగా నిర్వీర్యం చేసిందని పొన్నం విమర్శించారు. ఆ కాలంలో ఒక్క కొత్త బస్సు కొనలేదని, ఒక్క కొత్త ఉద్యోగం కూడా ఇవ్వలేదని ఆరోపించారు. అంతేకాకుండా, ఉద్యోగులకు చెందిన సీసీఎస్, పీఎఫ్ నిధులను కూడా అప్పటి ప్రభుత్వం వాడుకుందని ఆయన తెలిపారు. తమ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆర్టీసీ ఉద్యోగులకు బాండ్ రూపంలో రూ.400 కోట్లు, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పీఎఫ్ బకాయిలు రూ.1,039 కోట్లు, సీసీఎస్ బకాయిలు రూ.345 కోట్లు చెల్లించామని మంత్రి గుర్తు చేశారు. వీటితో పాటు 1,500 మందికి కారుణ్య నియామకాలు పూర్తి చేశామని, కొత్తగా మరో 3,038 పోస్టుల భర్తీకి అనుమతి ఇచ్చామని కార్మిక సంఘాల నేతలకు వివరించారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని, సహకరించాలని ఆయన కోరారు.

## సీమరాజా, కిర్రాక్ ఆర్పీలపై పోలీసులకు ఫిర్యాదు చేసిన అంబటి రాంబాబు



అమరావతి : తమ పార్టీపైనా, పార్టీ నేతలపైనా సోషల్ మీడియా వేదికగా జరుగుతున్న తప్పుడు ప్రచారంపై వైసీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వైసీపీకి వ్యతిరేకంగా అసత్యాలు ప్రచారం చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పోలీసులు తమ ఫిర్యాదులపై స్పందించని పక్షంలో న్యాయస్థానాలను ఆశ్రయించక తప్పదని హెచ్చరించారు. ఆ కేసును తానే వాదిస్తానని అన్నారు. నేడు గుంటూరులోని పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు సమర్పించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ సోషల్ మీడియా విభాగం (ఐటీడీపీ) తమ పార్టీపైనా, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపైనా, తనపైనా దుష్ప్రచారం చేస్తోందని అంబటి రాంబాబు ఆరోపించారు. ఈ మేరకు ఐటీడీపీపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దీంతో పాటు, వైసీపీ కండువా వేసుకుని అసత్య ప్రేలాపనలు చేస్తున్నారని ఆరోపిస్తూ సీమ రాజా పైనా, మాజీ మంత్రి రోజా తదితరులపై అనుచిత వీడియోలు చేస్తున్నారంటూ కిర్రాక్ ఆర్పీ పైనా వేర్వేరుగా ఫిర్యాదులు చేసినట్లు వెల్లడించారు. గతంలో తాము చేసిన ఫిర్యాదులపై పోలీసులు ఎటువంటి చర్యలూ చేపట్టలేదని అంబటి రాంబాబు విమర్శించారు. అందుకే ఈసారి ఫిర్యాదు చేసి, అందుకు సంబంధించిన రసీదును కూడా తీసుకున్నట్లు పేర్కొన్నారు. తమ ఫిర్యాదులను పోలీసులు పట్టించుకోవడం లేదని, కానీ టీడీపీ నేతలు ఫిర్యాదు చేస్తే మాత్రం వెంటనే స్పందించి తప్పుడు కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుతం పోలీస్ వ్యవస్థ పూర్తిగా టీడీపీ నియంత్రణలో ఉందని వ్యాఖ్యానించారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ప్రోత్సాహంతోనే ఐటీడీపీ పేరుతో వైసీపీ నేతలపై అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని అంబటి ఆరోపించారు. ఈ వ్యవహారంలో బాధ్యులపై పోలీసులు చర్యలు తీసుకునేంత వరకు తమ పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. దోషులను చట్ట ప్రకారం శిక్షించే వరకు విశ్రమించబోమని, అవసరమైతే ఈ విషయంపై సుప్రీం కోర్టు వరకు వెళ్లేందుకైనా సిద్ధమని అన్నారు. పార్టీ తరపున తానే స్వయంగా వాదనలు వినిపిస్తానని తెలిపారు. సీమ రాజా, కిర్రాక్ ఆర్పీ లాంటి వారు చట్టం నుంచి తప్పించుకోలేరని, వారి వెనుక ఎంత పెద్దవారున్నా శిక్ష అనుభవించాల్సిందేనని అంబటి రాంబాబు పేర్కొన్నారు.

## పాకిస్థాన్‌కు షాక్ మీద షాక్..
## చీనాబ్ డ్యామ్‌లపై భారత్ కీలక చర్యలు



న్యూఢిల్లీ : పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో భారత్ జలవనరుల ప్రాజెక్టులపై దృష్టి సారించింది. చీనాబ్ నదిపై ఉన్న సలాల్, బాగ్లిహార్ జల విద్యుత్ ప్రాజెక్టుల నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచే పనులను ప్రారంభించినట్లు జాతీయ మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. ఇప్పటికే ఈ డ్యామ్‌లను భారత్ మూసివేసింది. సింధు జలాల ఒప్పందాన్ని భారత్ నిలిపివేసినందున, ఈ పనుల గురించి పాకిస్థాన్‌కు సమాచారం ఇవ్వలేదు. ప్రభుత్వ రంగ సంస్థ ఎన్‌హెచ్‌పీసీ ఆధ్వర్యంలో ఈ రెండు డ్యామ్‌ల రిజర్వాయర్లలో నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు అవసరమైన పనులు మొదలయ్యాయని సమాచారం. ఇటీవల ఒక రిజర్వాయర్‌లో పేరుకుపోయిన బురదను తొలగించేందుకు 'ఫ్లషింగ్' ప్రక్రియను చేపట్టారు. గత గురువారం ప్రారంభమైన ఈ ప్రక్రియ దాదాపు మూడు రోజుల పాటు కొనసాగింది. ఈ ఫ్లషింగ్ ప్రక్రియ ద్వారా విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం పెరగడంతో పాటు టర్బైన్ల మన్నిక కూడా పెరుగుతుందని అధికారులు పేర్కొంటున్నారు. సింధు జలాల ఒప్పందాన్ని భారత్ నిలిపివేసిన తరువాత, ఆ ఒప్పంద స్ఫూర్తికి భిన్నంగా భారత్ చర్యలు చేపట్టడం ఇదే తొలిసారని నిపుణులు విశ్లేషిస్తున్నారు. దీనిపై సెంట్రల్ వాటర్ కమిషన్ మాజీ అధిపతి కుష్వీందర్ వోహ్రా మాట్లాడుతూ, "ఒప్పందాన్ని నిలిపివేసినందున, మన ప్రాజెక్టులలో చేపట్టే మార్పుల గురించి పాకిస్తాన్‌కు తెలియజేయాల్సిన బాధ్యత భారత్‌కు లేదు" అని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో భారత్ తన అవసరాలకు అనుగుణంగా ప్రాజెక్టులలో మార్పులు చేసుకునే అవకాశం ఏర్పడింది. సలాల్ డ్యామ్‌ను 1987లో, బాగ్లిహార్ డ్యామ్‌ను 2009లో ప్రారంభించారు. ఈ డ్యామ్‌లతో పాటు సింధు నదీ వ్యవస్థ పరిధిలోకి వచ్చే మరో అరడజను ప్రాజెక్టులు భారత్ వద్ద ఉన్నాయి. ఈ ప్రాజెక్టులన్నింటిలో నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచితే, భవిష్యత్తులో పాకిస్థాన్‌కు నీటి కొరత ఏర్పడే అవకాశాలున్నాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. అయితే, తక్షణమే పాకిస్థాన్‌కు నీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయే అవకాశం లేదని వారు స్పష్టం చేస్తున్నారు. ప్రస్తుతం జరుగుతున్న పనులపై భారత ప్రభుత్వం గానీ, ఎన్‌హెచ్‌పీసీ గానీ అధికారికంగా ఎటువంటి ప్రకటన చేయలేదు. మరోవైపు, సింధు జలాల ఒప్పందం విషయంలో భారత్ చర్యలను ఎదుర్కొనేందుకు పాకిస్థాన్ వద్ద పరిమిత అవకాశాలే ఉన్నాయి. ఈ ఒప్పందానికి మధ్యవర్తిగా వ్యవహరించిన ప్రపంచ బ్యాంకును ఆశ్రయించడం మినహా ఇతర మార్గాల వల్ల పెద్దగా ప్రయోజనం ఉండకపోవచ్చు. ప్రపంచ బ్యాంకుకు కేవలం మధ్యవర్తిత్వం వహించే పాత్రే ఉంది తప్ప, ఒప్పందాన్ని అమలు చేసే అధికారం లేదని నిపుణులు గుర్తు చేస్తున్నారు. అభిప్రాయభేదాలు వస్తే చర్చలకు ప్రోత్సహించడం, తటస్థ నిపుణులను లేదా కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఛైర్మన్లను నియమించడం వరకే దాని పరిధి ఉంటుంది.

# ఎవరిమీద మీ సమరం..?

మొదటి పేజి తరువాయి



మీరు ప్రకటించిన సమరం 97 శాతం ప్రజల మీదనా. సమరం కాదు.. సమయ స్ఫూర్తి కావాలి. ఏవైనా సమస్యలు ఉంటే చర్చకు రండి.. చర్చిందాం. రాజకీయ నాయకుల్లో ఉద్యోగులు పావుగా మారొద్దు. ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పుడు సహకరించాల్సిన బాధ్యత ప్రభుత్వ సంఘాలకు లేదా? అని ప్రశ్నించారు. కొత్త కోరికలతో ధర్నాలు చేస్తే ఉన్న వ్యవస్థ కుప్పకూలుతుంది. బాధ్యతగా వ్యవహరించాల్సిన మీరు బాధ్యత మరిచి వ్యవహరిస్తే తెలంగాణ సమాజం సహించదు. అప్పులు పుట్టినా ఏదైనా చేయొచ్చు.. కానీ ఎక్కడా అప్పు పుట్టడం లేదు.స్వీయ నియంత్రణనే దీనికి పరిష్కారం. ఉద్యోగ సంఘాల నాయకుల్లారా.. రాష్ట్ర ప్రభుత్వం మన కుటుంబం.. కుటుంబ పరువును బజారున పడేయొద్దు. ప్రభుత్వాన్ని అస్థిరపరిచాలనే రాజకీయ పార్టీల కుట్రలో ఉద్యోగ సంఘాలు పావులుగా మారొద్దు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ దెబ్బతిన్నది.. నన్ను కోసినా వచ్చిన ఆదాయానికి మించి నేను ఏం చేయలేను. ఉద్యోగ సంఘాల నాయకుల్లారా ఇప్పుడు కావాల్సింది సమరం కాదు సమయస్ఫూర్తి, సంయమనం. మీ అందరికీ విజ్ఞప్తి చేస్తున్నా తెలంగాణను మళ్లీ కోతుల గుంపుకు అప్పగించొద్దు. నాతో కలిసి రండి.. తెలంగాణను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళదాం. ఇక సమరమే అని ఉద్యోగ సంఘాలు ప్రకటిస్తున్నాయి. మీ సమరం తెలంగాణ ప్రజలపైనా? ఎందుకు మీ సమరం గతంలో లేని విధంగా మొదటి తారీఖునే జీతాలు ఇస్తున్నందుకా?. ప్రతీ నెలా ఏడు వేల కోట్లు ప్రతీ నెలా కట్టాల్సిన పరిస్థితి ప్రభుత్వానిది. గత పాలకులు 8500 కోట్లు రిటైర్మెంట్ బెనిఫిట్స్ బకాయిలు పెట్టి వెళ్లారు. కొన్ని రాజకీయ పార్టీలు మాపై ఆరోపణలు చేస్తున్నాయి.. అవన్నీ వాళ్లు చెల్లించకుండా పెండింగ్ పెట్టి వెళ్లిన బకాయిలే. కేవలం పదహారు నెలల్లో మేం 30 వేల కోట్ల నగదు రైతుల ఖాతాలకు బదిలీ చేశాం. ఉచిత విద్యుత్ అని చెప్పి విద్యుత్ శాఖకు బకాయిలు పెట్టి వెళ్లారు. విద్యుత్ ఉత్పత్తికి బొగ్గు కొనుగోలు చేసి సింగరేణికిబకాయి పెట్టి వెళ్లారు. ప్రాజెక్టులు కట్టామని చెప్పి .. కాంట్రాక్టర్లకు బకాయిలు పెట్టారు. 11 శాతం వడ్డీకి అప్పులు తెచ్చారు.. ఇంతకంటే దుర్మార్గం ఉంటుందా?. ప్రభుత్వం అంటే మేం ఒక్కరమే కాదు మనమంతా కలిస్తేనే ప్రభుత్వం. మనం పాలకులం కాదు.. సేవకులం. ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పుడు సహకరించాల్సిన ఉద్యోగ సంఘాల నాయకులు సమరం అని అంటున్నారు. ఎవరిపై సమరం ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు వారికి అండగా ఉండాల్సిన బాధ్యత ఉద్యోగ సంఘాల నాయకులపై లేదా? అని ప్రశ్నల వర్షం కురిపించారు.

## 'ఆ చావులకు మీరేం సమాధానం చెబుతారు'


పెద్దపల్లి: మావోయిస్టులతో కేంద్రం చర్చలు జరిపే ప్రసక్తే లేదనే విషయాన్ని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి, తెలంగాణ ఎంపీ బండి సంజయ్ మరోసారి స్పష్టం చేశారు. ఈ మేరకు రామగుండంలో బండి సంజయ్ మాట్లాడుతూ.. తుపాకీ చేతపట్టి అమాయకులను చంపుతుంటే చర్చలేంటని సంజయ్ ప్రశ్నించారు. ఆ చావులకు మీరేం సమాధానం చెబుతారంటూ బండి సంజయ్ ఎదురు ప్రశ్నించారు. 'కాంగ్రెస్ రెండు నాల్కల ధోరణి ప్రదర్శిస్తోంది. మావోయిస్టులు దశాబ్దాలుగా అమాయకులను కాల్చి చంపిన సంగతి గుర్తు లేదా?, మావోయిస్టుల సానుభూతి పరులు సాధించిందేంటి?, మావోయిస్టులు ఎవరున్నా తుపాకీ వీడి లొంగిపావాల్సిందే.. జన జీవన ప్రవంతిలో కలవాల్సిందే. పౌర హక్కుల సంఘం నేతలారా.. నక్సల్స్ నచ్చజెప్పండి' అని బండి సంజయ్ స్పష్టం చేశారు. ఇక తెలంగాణ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది కులగణన కానేకాదన్నారు బండి సంజయ్. కేవలం సర్వే మాత్రమే జరిగిందన్నారు. ఇక్కడ బీసీలకు తీవ్రమైన అన్యాయం చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం చేసింది కులగణన కానేకాదన్నారు. ప్రతి ఇంటికి కచ్చితంగా వెళ్లి నిర్వహించేది కులగణన అని అన్నారు. జనగణన మాదిరిగానే మోదీ ప్రభుత్వం కులగణన చేస్తుందన్నారు. బీసీలకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దుతామన్నారు బండి సంజయ్.

## రైతులకు, కౌలు రైతులకు గుడ్ న్యూస్ చెప్పిన ఏపీ ప్రభుత్వం

మొదటి పేజి తరువాయి

ఈ మొత్తాన్ని మూడు విడతలుగా నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పథకం కింద అందించే రూ. 6 వేలతో కలిపి ఈ మొత్తం రూ. 20,000 అందజేయనున్నారు. ఈ పథకం కింద అటవీ భూములపై హక్కు పత్రాలు (ఆర్ఓఎఫ్ఆర్) కలిగిన రైతులను కూడా అర్హులుగా గుర్తించనున్నారు. ఈ పథకం అమలు కోసం క్షేత్రస్థాయిలో లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. వ్యవసాయ, ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖల సహాయకులు, తహసీల్దార్లు, మండల వ్యవసాయ అధికారులు తమ పరిధిలోని కౌలు రైతులు, ఆర్ఓఎఫ్ఆర్ రైతుల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, అర్హుల జాబితాలను సిద్ధం చేయాలని సూచించింది. ఇలా ధ్రువీకరించిన జాబితాలను మే 20వ తేదీలోగా 'అన్నదాత సుఖీభవ' అధికారిక వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని స్పష్టం చేసింది. ఈ పథకం అమలులో కుటుంబాన్ని (భర్త, భార్య, మైనర్ పిల్లలు) ఒక యూనిట్‌గా పరిగణిస్తారు. కుటుంబంలోని పిల్లలకు వివాహమైతే వారిని ప్రత్యేక యూనిట్‌గా గుర్తిస్తారు. వ్యవసాయం, ఉద్యాన పంటలు, పట్టు పరిశ్రమకు సంబంధించిన పంటలు సాగు చేసే వారందరికీ ఈ పథకం వర్తిస్తుంది. అయితే, ఈ పథకానికి కొన్ని వర్గాలను మినహాయిస్తున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. ఆర్థికంగా ఉన్నత స్థితిలో ఉన్నవారు, గతంలో లేదా ప్రస్తుతం రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్నవారు, ప్రభుత్వ ఉద్యోగులు, వైద్యులు, ఇంజనీర్లు, న్యాయవాదులు, చార్టర్డ్ అకౌంటెంట్లు, ఆర్కిటెక్టులు వంటి వృత్తి నిపుణులు, గత ఆర్థిక సంవత్సరంలో ఆదాయపు పన్ను చెల్లించిన వారు ఈ పథకానికి అర్హులు కారని ప్రభుత్వం తేల్చి చెప్పింది.

## ఇళ్ల నిర్మాణాలకు పొసెషన్ సర్టిఫికెట్లు జారీ చేయండి జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా




నంద్యాల రిపోర్టర్/ మోహన్ (శుభోదయం న్యూస్ ): సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ అభివృద్ధి అంశాలపై సమావేశం నిర్వహించారు.సమావేశంలో జాయింట్ కలెక్టర్ సి. విష్ణుచరణ్, డిఆర్ఓ రామునాయక్, డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలో 26,139 మంది ఇళ్లు లేని నిరుపేదలు ఉన్నారని ఇప్పటివరకు 12,651 ఇళ్లకు మాత్రమే పొసెషన్ సర్టిఫికెట్లు మంజూరు చేశామని మండలాల వారీగా సంబంధిత లబ్ధిదారుల డేటాను తీసుకొని పొసెషన్ సర్టిఫికెట్లు ఇచ్చేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తహశీల్దార్లను కలెక్టర్ ఆదేశించారు. ఇళ్ల నిర్మాణంలో చాలా వెనుకబడి ఉన్నామని ఆర్డీఓలు, తహశీల్దార్లు బాధ్యతగా తీసుకొని గృహ నిర్మాణ పనులు ప్రారంభించేందుకు లబ్ధిదారులను ప్రోత్సహించాలని కలెక్టర్ సూచించారు.

## కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యల పరిష్కరించాలని కోరుతూ మంత్రి ఎన్ఎండి ఫరూక్ కు వినతిపత్రం




నంద్యాల రిపోర్టర్/ మోహన్ (శుభోదయం న్యూస్ ): గత ఎనిమిది రోజులుగా నంద్యాల బిఎస్ఎన్ఎల్ ఆఫీస్ ముందర రిలే నిరాహార దీక్షలు చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంత్రి ఫరూక్ గారి ఆహ్వానం మేరకు నంద్యాల తెలుగుదేశం పార్టీ కార్యాలయం (రాజ్ టాకీస్) వద్దకు వచ్చి వారి సమస్యలను వినతి పత్రం రూపంలో మంత్రి ఫరూక్ కు విన్నవించుకున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2019 నుండి గ్రామీణ ప్రాంతాలలోని ఉపకేంద్రాలలో బీఎస్సీ నర్సింగ్ పట్టభద్రులను కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లుగా నియమించారని గ్రామీణ ప్రాంతంలోని ప్రజల ఆరోగ్య సంరక్షణ బాధ్యతలు నిర్వహిస్తూ జాతీయ ఆరోగ్య కార్యక్రమాలతో ప్రజారోగ్య వ్యవస్థలను బలపరుస్తూ ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ నిర్మాణంలో కీలకపాత్ర పోషించిన కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు గత వైఎస్ఆర్సిపి ప్రభుత్వం విస్మరించిందని ఆరు సంవత్సరాలుగా ఉద్యోగ భద్రత , ఆర్థిక భద్రత లేదని , జీతాల విషయంలో తీవ్ర నిరాశ వైయస్ఆర్సీపీ ప్రభుత్వంలో ఎదురైందన్నారు . గత ప్రభుత్వంలో ఎన్నిసార్లు ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్న పట్టించుకోవడంలేదని కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజలందరి సమస్యలను పరిష్కరిస్తున్న తరుణంలో మా సమస్యను కూడా పరిష్కరిస్తారని ఉద్దేశంతో మంత్రి ఫరూక్ గారి ఆహ్వానం మేరకు (రాజ్ టాకీస్) కి వచ్చి వారికి సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేయడం జరిగిందని వారు తెలిపారు.ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ సానుకూలంగా స్పందిస్తూ సమస్యలను పై అధికారులకు ఫోన్ ద్వారా తెలియజేయడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి జిల్లెల్ల శ్రీరాములు , ఉర్దూ డిఐ అస్మద్దీన్ తదితరులు పాల్గొన్నారు.


## గ్రామ కమిటీ అధ్యక్షుడు చంద్రమౌళి మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు...

### గుండెపోటుతో కాంగ్రెస్ నాయకుడు మృతి..

### నివాళులర్పించిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



రేగొండ, మండలం రిపోర్టర్ – మంతెన సురేష్, (శుభోదయం న్యూస్) : రేగొండ మండలంలోకాంగ్రెస్ లో విషాదం చోటు చేసుకుంది.ఉమ్మడి రేగొండ మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు బోల్లేపెల్లి చంద్రమౌళి (50) గుండెపోటుతో మృతి చెందారు.ఆయనకు భార్య , ఇద్దరు కూతుర్లు ఉన్నారు.ఆయన ఆకస్మిక మృతితో మండల కేంద్రంలో విషాదఛాయలు అలుముకున్నాయి.చంద్రమౌళి మరణవార్త తెలుసుకున్న భూపాలపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఆయన పార్థివ దేహానికి పూలమాలవేసి, కాంగ్రెస్ పార్టీ జెండాను కప్పి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా చంద్రమౌళి గ్రామంలో పార్టీ అభివృద్ధి కోసం చివరి వరకు పాటుపడ్డారని సంతాపం తెలిపారు. చిన్న వయసులో చంద్రమౌళి గుండెపోటుతో హఠన్మరణం చెందడం వారి కుటుంబానికి పార్టీకి తీరని లోటు అన్నారు.చంద్రమౌళి కుటుంబానికి ఎల్లవేళలా ఉంటానని ఎమ్మెల్యే అన్నారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం ప్రసాదించాలని భగవంతుని ప్రార్థించారు.పార్టీలకు అతీతంగా అందరితో కలివిడిగా ఉండే చంద్రమౌళి మరణాన్ని జీర్ణించుకోలేకపోతున్నామనీ కాంగ్రెస్, టీఆర్ఎస్ , బీజేపీ నాయకులు కన్నీరు మున్నీరయ్యారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఇప్పకాయల నరసయ్య, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుటోజు కిష్టయ్య, ఎన్ఎస్ఆర్ సంస్థల చైర్మన్ నాయినేని సంపత్ రావు, ఎంపీపీ పున్నం లక్ష్మి రవి,ఓబీసీ సెల్ మండల అధ్యక్షుడు పొనుగోటి వీరబ్రహ్మం, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మేకల బిక్షపతి, మాజీ ఉప సర్పంచ్ గండి తిరుపతి గౌడ్, తదితరులు పాల్గొన్నారు..



# ఆలీబాబా 40 దొంగల దందా ఇక జరగదు ధర్మవరంలో బీజేపీ నేతల హెచ్చరిక



ఉమ్మడి ,అనంతపురం జిల్లా బ్యూరో "నరేంద్ర "(శుభోదయం న్యూస్): కమిషన్ రాజ్యం ముగిసింది %-%మంత్రి సత్య కుమార్ యాదవ్ గారి సారథ్యంలో ధర్మవరానికి పారదర్శక పాలన సాగిస్తున్నాం. – బిజెపి నేతలు ధర్మవరం ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటాం – బిజెపి నేతలు ధర్మవరం పట్టణంలోని ఎన్డీఏ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో బీజేపీ నాయకులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లు గౌరవనీయులు ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మరియు వారి కార్యాలయ ఇంచార్జ్ హరీష్ బాబు పై చేసిన అనుచిత వ్యాఖ్యలు అత్యంత అవివేకపూరితమని ఖండించారు. కూటమి ప్రభుత్వం పట్ల అవమానకరంగా వ్యవహరిస్తూ బురద చల్లే ప్రయత్నాలు చేస్తుండటం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా బీజేపీ నేతలు గొట్లూరు చంద్ర, లీలావతి, పోతుకుంట రాజు, చంద్రమౌళి, డోలా రాజా రెడ్డి, నబి రసూల్ తదితరులు మాట్లాడుతూ %-% ధర్మవరం పట్టణంలో గత ప్రభుత్వ కాలంలో తాగునీటి కొరత, మురుగునీటి పారుదల సమస్యలు, రహదారి మరమ్మతుల తడబాటు, పౌరసదుపాయాల్లో తీవ్ర లోపాలు వాస్తవంగా ప్రజలు ఎదుర్కొన్న సమస్యలని గుర్తు చేశారు. ఈ అవినీతి పాలనకు ప్రధాన బాధ్యుడు మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి వారు పేర్కొన్నారు. అలాగే ధర్మవరం చెరువును కబ్జా చేసి, చెరువు కింద ఉన్న మాగాను నిర్లక్ష్యం చేసి, అక్కడి రైతుల పొట్టను గండిపెట్టిన ఏకైక నాయకుడు కేతిరెడ్డి అని ఆరోపించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు తమ అధినేత కోసం మాత్రమే కాకుండా ప్రజల సంక్షేమం గురించి ఆలోచించాలి, లేనిపక్షంలో ప్రజలే వారి భవిష్యత్తును తీర్మానిస్తారని హెచ్చరించారు. కేతిరెడ్డి హయాంలో ప్రతి పనీ కమీషన్ తో ముడిపడి ఉండేదని, ఏ ప్రభుత్వ పథకం అందాలన్నా కమిషన్ ఇచ్చిన వారికే లబ్ధి చేకూర్చే వారని వారు చెప్పారు. అదేవిధంగా కేతిరెడ్డి, ఆయన అనుచరులు చేసిన కబ్జా గురించి ధర్మవరంలో ప్రతి వ్యక్తికి తెలిసిన విషయమే అని అన్నారు. ఖాళీ జాగా కనిపిస్తే కబ్జా చేయడమే కాకుండా , ఎంతోమంది అమాయకులను బెదిరించి వారి స్థలాలను బలవంతంగా రాయించుకున్న సంగతి అప్పుడే మర్చిపోయారా అని వారు ప్రశ్నించారు. కేతిరెడ్డి అతని అనుచరులు ఆలీబాబా 40 దొంగలు మాదిరి దందాలు చేశారని, ధర్మవరంలో బిజెపి జెండా ఎగిరిన తర్వాత ఆ 40 దొంగలు తమ అక్రమ ఆస్తులు కాపాడుకోవడానికి బిజెపిలోకి వస్తామంటూ బిజెపి కార్యాలయం తలుపులు కొట్టిన విషయం అందరికీ తెలిసిందేనని చెప్పారు. ప్రజల సమస్యల పట్ల స్పందించని గత పాలన, అవినీతి కుంభకోణాలు ధర్మవరం అభివృద్ధిని నిలిచిపోయేలా చేశాయని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్లో ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడిన 9 నెలల వ్యవధిలోనే అనేక అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించబడ్డాయని తెలిపారు. గౌరవనీయులు సత్యకుమార్ యాదవ్ నాయకత్వంలో తాగునీటి సమస్యలపై అమృత్ పథకం ద్వారా శాశ్వత పరిష్కారం మురుగునీటి పారుదల పనులకు స్వచ్ఛ భారత్ మిషన్ ద్వారా నిధుల కేటాయింపు పీఎం కిసాన్, ఉజ్వల యోజన, జనధన్ యోజన ద్వారా ప్రజల జీవన ప్రమాణాల అభివృద్ధి ధర్మవరం పట్టణ అభివృద్ధికి కేంద్రం నుంచి రూ.100 కోట్ల మంజూరు మున్సిపాలిటీకి నిధుల మంజూరు, పారదర్శక పాలన నిరుద్యోగులకు జాబ్ మేళాల ద్వారా ఉపాధి అవకాశాలు, అనారోగ్య అభాగ్యులకు "సిఎంఆర్ఎఫ్ "నిధుల అందించడం, ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అవినీతి లేకుండా, నైతిక విలువలతో పరిపాలన సాగిస్తోందని, ఒక్క రూపాయి లంచం లేకుండా పాలన కొనసాగుతోందని స్పష్టం చేశారు. మా నాయకుడు సత్య కుమార్ యాదవ్ ఇలాంటి అవినీతి వారిని ఎన్నటికీ పార్టీలోకి చేర్చుకోరని , అవినీతి చేసిన వారు దాని ప్రతిఫలం అనుభవించే రోజు దగ్గరలోనే ఉందని వారు హెచ్చరించారు. చెన్నకేశవ స్వామి రథోత్సవం సందర్భంగా జరిగే కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ నాయకులు ప్రజల ముందే నైతిక ప్రమాణానికి సిద్ధంగా ఉన్నారా? అని బీజేపీ నేతలు సవాల్ విసిరారు. ఇందుకోసం, ధర్మవరం అభివృద్ధి పై ప్రజల ఆశలు, విశ్వాసాన్ని గౌరవిస్తూ ఎన్డీఏ ప్రభుత్వం అన్ని రంగాల్లో ప్రగతిని కొనసాగిస్తోందని తెలియజేశారు. గౌరవనీయులు నరేంద్ర మోదీ దిశానిర్దేశం, గౌ. సత్యకుమార్ యాదవ్ కృషి, బీజేపీకి ఉన్న అనుభవం ధర్మవరం అభివృద్ధికి దిశానిర్దేశకంగా నిలుస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు చంద్రశేఖర్, రూరల్ అధ్యక్షులు గొట్లూరు చంద్ర, జిల్లా ఉపాధ్యక్షులు సాకే ఓబ్లేష్, బిజెపి మహిళా నాయకురాలు కంచం లీలావతి మైనార్టీ నాయకులు నబి రసూల్, డోలా

రాజారెడ్డి, పోతుకుంట రాజు, చంద్రమౌళి, వీరనారప్ప, కావేటి మల్లికార్జున, చిన్న బాలముని, పోతులయ్య, గంగాధర, కుంచేపు నారప్ప, పోతునాగేపల్లి లక్ష్మీనారాయణ, భక్తవత్సల నాయుడు, గొట్లూరు అనిల్, వడ్డే శ్రీనివాసులు, బోయ నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

## దాసు సంక్షేమ సంఘం అధ్యక్షులుగా పాముల ప్రసాద్



శుభోదయం న్యూస్, జీలుగుమిల్లి: మండల కేంద్రం జీలుగుమిల్లి నూతన దాసు సంక్షేమ సంఘం అధ్యక్షులుగా పాముల వర ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం సంఘ సమావేశం పాముల వరప్రసాద్ ఇంటి వద్ద పోలుకొండ నరసింహారావు అధ్యక్షతన జరిగింది. నూతన అధ్యక్షులుగా ఎన్నికైన వరప్రసాద్ మాట్లాడుతూ తనను అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు సభ్యులందరికీ ధన్యవాదాలు తెలిపారు. మన సంక్షేమ సంఘం అభివృద్ధి కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. సంఘ సభ్యుల సహకారంతో శుభ, అశుభ కార్యక్రమాలను అందరం కలిసి నిర్వహించుకుందామని తెలిపారు. ఈ నూతన కమిటీలో కార్యదర్శిగా జెట్టి రామకృష్ణ, సహాయ కార్యదర్శిగా కోటపాటి రమేష్, ఉపాధ్యక్షులుగా పోలుకొండ నరసింహారావు, కోశాధికారిగా బట్టు లక్ష్మి తో పాటు మరో పదహారు మందిని కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. సంక్షేమ సంఘం ఏర్పాటుకు సహకరించిన పల్లం రవికుమార్ జంగారెడ్డిగూడెం, నేలటూరి సత్యనారాయణ, ద్వారకాతిరుమల, కోరం నరేష్ అచ్చన్నపాలెం వారికి నూతన సంఘం కృతజ్ఞతలు తెలిపింది. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యుల బీర రవి, గడ్డం వీరబాబు, గెడ్డం జనార్ధన్, ఉర్ల బాబి, పోలుకొండ నాగు, గెడ్డం పండు, బట్టు గోపి, కోరం చెన్నకేశవులు, భూషి మధు, చెటగోపం నరసింహ, దాస్యం నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## భూ సర్వే వల్ల భూములు కోల్పోయిన రైతులును ఆదుకోవాలి.... తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతులు ధర్నా...




తుగ్గలి,మండల రిపోర్టర్ మాధవ్ (శుభోదయం న్యూస్ ): భూ సర్వే వల్ల భూముల కోల్పోయిన రైతులను ఆదుకోవాలని కోరుతూ సోమవారం మండల కేంద్రమైన తుగ్గలి సిపిఎం రైతు సంఘం ఆధ్వర్యంలో రైతుల ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు, సిపిఎం మండల కార్యదర్శి శ్రీరాములు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో భూ సర్వే వల్ల తమ సొంత పొలాలను రైతులు కోల్పోవడం జరిగిందన్నారు. కొన్ని సంవత్సరాల నుండి అనుభవంలో ఉన్న భూములను ఆన్లైన్ తొలగించడంతో బ్యాంకులో తీసుకున్న రుణాలు కు బ్యాంకు అధికారులు తీవ్ర ఒత్తిడి చేస్తున్నారని, బ్యాంకులో తీసుకున్న రుణాలు రీ షెడ్యూల్ చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారని ఆయన తమ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూములని, చుక్కల భూములని, దేవాదాయ భూములను రైతుల పొలాలను అన్యాయంగా తొలగించారని, దీంతో బ్యాంక్ అధికారుల ఒత్తిడి తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారని ఆయన తన ఆందోళ నను వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అనుభవములో ఉన్న భూములను తక్షణమే ఆన్లైన్లో చూపించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రైతుల బలరాముడు, వెంకటేష్ నాయక్, బలరాం నాయక్, ఈరన్న నాయక్, సురేషు,కొండారెడ్డి,రంగస్వామి తదితరులు పాల్గొన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

## జిల్లా రెడ్ క్రాస్ సొసైటీలో అవకతవకలు - సభ్యులు, ప్రజల్లో ఆందోళన



(శుభోదయం న్యూస్) విజయవాడ:గత మూడు ఏళ్ళుగా కృష్ణా జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ శాఖలో అవకతవకలు, నిధుల దుర్వినియోగం పెచ్చరిల్లినట్లు జీవితకాల సభ్యులు, స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సేవా భావంతో నడవాల్సిన ఈ సంస్థలో సెక్రటరీ అక్రమంగా నిధులు నెలవారి జీతం రూపంలో దండుకున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సంస్థ నిధుల దుర్వినియోగంపై అనేకసార్లు రాష్ట్ర శాఖకు ఫిర్యాదులు చేసినప్పటికీ, అధికారులు తగిన చర్యలు తీసుకోకపోవడం పట్ల సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర శాఖ ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అధ్యక్షులుగా, జిల్లా శాఖ కలెక్టర్ అధ్యక్షులుగా వ్యవహరిస్తారు. అయినా నేటి వరకూ అక్రమాలపై ఎటువంటి పరిశీలన జరగకపోవడం గమనార్హం. మరోవైపు ఇప్పటివరకు అక్రమాలకు పాల్పడిన ఇదే మేనేజ్మెంట్ కమిటీ సభ్యులు ఎటువంటి ఎన్నికలు నిర్వహించకుండా తిరిగి మరో మూడేళ్లపాటు కమిటీ నామినేటెడ్ పద్ధతిలో ఏర్పాటు చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని, దీనికి అధికారులు సైతం సహకారం అందిస్తున్నారని తెలుస్తుంది. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ రెడ్ క్రాస్ సొసైటీ శాఖపై అక్రమాలపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని రెడ్ క్రాస్ సొసైటీ జీవితకాల సభ్యులు, కొండి శెట్టి సురేష్ బాబు ప్రజలు కోరుతున్నారు.

## ఘనంగా భగీరథ మహర్షి జయంతి వేడుకలు



బాపట్ల, (శుభోదయం న్యూస్) : భగీరథ మహర్షి జయంతి సందర్భంగా బాపట్ల జిల్లా పట్టణ సీల్ రోడ్ సెంటర్లో బీసీ నాయకులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా బీసీ సమన్వయ కమిటీ బాపట్ల జిల్లా చైర్మన్ ఉప్పాల మురళి గౌడ్ మాట్లాడుతూ, సగర కుల దైవమైన భగీరథ మహర్షి జయంతి వేడుకలు జరపడం సంతోషదాయకమన్నారు, ఆ మహాదేవుడు దీవెనలు ఈ రాష్ట్ర దేశ ప్రజలందరూ ఉండాలని భగీరథ జయంతి శుభాకాంక్షలు తెలిపారు కార్యక్రమంలో పాల్గొన్నవారు, స్వాములు బీసీ నాయకులు పాల్గొన్నారు,



## త్రిపురాంతకం మండలంలో మొదలైన ఉపాధి హామీలో వసూళ్లు
## కూలీల నుంచి వారానికి 300 వసూలు చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు



ఎర్రగొండపాలెం, నియోజకవర్గ ఇంచార్జి - కాకర్ల కోటయ్య (శుభోదయం న్యూస్): పేదలకు ఉపాధి పనులు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన ఉపాధి హామీ పథకం త్రిపురాంతకం మండలంలో అధికారుల అక్రమాలకు ఉపాధి వరంగా మారింది. ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు మండల అధికారులు కలిసి ఉపాధి పేరుతో కోట్ల రూపాయల అవినీతికి పాల్పడుతున్నారు. మండలంలోని అన్ని గ్రామా ల్లో ఇదే తంతు కొనసాగింది. గత రెండు వారాల నుండి జరిగిన ఉపాధి హామీ పథకం పనులు కూలీలు పనులు చేయకుండానే ఫీల్డ్ అసిస్టెంట్లు కూలీల నుంచి వారానికి 300 రూపాయలు వసూలు చేసి ఒక్కొక్కరికి వెయ్యి నుండి 1500 రూపాయలు చెల్లిస్తామని ఫీల్డ్ అసిస్టెంట్లు కూలీలకు హామీ ఇస్తున్నారు. అయితే గ్రామాల్లో చెరువుల్లో అరకొరగా చేసిన పనులకు టెక్నికల్ అసిస్టెంట్లు చేసిన పనులకు కొలతలు పది రెట్లు ఎక్కువ చూపించి కోట్ల రూపాయలు ప్రభుత్వ ధనాన్ని వృధా చేస్తున్నారు.పనులు చేసిన కూలీలు వారానికి 300 రూపా యలు ఇవ్వకపోతే తక్కువ వేస్తూ డబ్బులు ఇచ్చిన వారికి 1400 నుంచి పదిహేను వందల రూపాయలు చెల్లించినట్లు ఆరోపిస్తున్నారు. పర్య వేక్షించాల్సిన అధికారులు మామూలు తీసుకుంటూ తమకు సంబంధం లేదని చేతులుదులుపుకుంటున్నారు. గ్రామాల్లో అర కొరగా పనులు చేసి కొలతలు తీసి ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్ కలిసి ఎక్కువ బిల్లులు చెల్లించి కూలీల నుంచి అక్రమ వసూలు పాల్పడుతున్నారు. గ్రామాల్లో లేనివారికి వాళ్ల దగ్గర వారానికి 300 రూపాయలు వసూలు చేసి వాళ్లకు కూడా పనికి వెళ్ళినట్లు చూపిస్తున్నారు. సంబంధిత అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి అవినీతి చేయించే అధికారులపై నిఘా పెట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పరుగులు తీసిన తాసిల్దార్



నెల్లూరు జిల్లా ప్రతినిధి శ్రీనివాసులు, (శుభోదయం న్యూస్) : నెల్లూరు జిల్లా సైదాపురం మండలంలోని గులించెర్ల చాగనం మధ్యలో పంచాయతీల పరిధిలో పూజిత మినరల్స్కు అనుమతులు లేకుండా పనులు జరుగుతున్నాయని, అక్కడినుండి తెల్ల రాయి అక్రమ రవాణా చేస్తున్నారని జిల్లా కలెక్టర్కు సమాచారం వెల్లడంతో కలెక్టర్ గారి ఆదేశాల మేరకు సైదాపురం తాసిల్దార్ రమాదేవి ఘటన స్థలానికి చేరుకొని తెల్ల రాయిని అక్రమంగా లోడ్ ఎత్తుకొని వెళ్లడానికి సిద్ధంగా ఉన్నటువంటి లారీని క్రైన్ను అడ్డుకొని వాటికి ఎటువంటి అనుమతి పత్రాలు లేనందున లారీను క్రైను అదుపులోనికి తీసుకోవడం జరిగిందని తదుపరి ఆ రెండు వెహికల్స్ ను సైదాపురం పోలీస్ స్టేషన్ తరలించడం చేయడం జరిగిందని మండల తాసిల్దార్ రమాదేవి తెలిపారు పై కార్యక్రమంలో వీఆర్వో అంకయ్య పోలీసు సిబ్బంది ఇది తరిలో పాల్గొన్నారు.

## అరుణాచల
## ఆర్గనైజేషన్ సేవలు అభినందనీయం ఉప్పాల మురళి గౌడ్



(శుభోదయం న్యూస్) : బాపట్ల టౌన్ ఇస్లాం పేటలో నివాసం ఉంటున్నటువంటి డ్రైవర్ షబ్బీర్ ఇటీవల కాలంలో కిడ్నీలు,ఊపిరితిత్తులు పాడయినాయని అనారోగ్యంతో బాధపడుతున్నటువంటి వ్యక్తికి ,అరుణాచలేశ్వర ఆర్గనైజేషన్, తరపునుంచి అరుణాచలేశ్వర ఆర్గనైజేషన్,సభ్యులందరూ ప్రోత్సాహంతో తాండ్ర సాంబశివరావు చేతుల మీదుగా వైద్య ఖర్చుల నిమిత్తం ఐదు వేల రూపాయల ఆర్థిక సహాయం చేయడం జరిగింది ఈ సందర్భంగా తాండ్ర సాంబశివరావు మాట్లాడుతూ నిజంగా ఆరోగ్య పరిస్థితి బాగాక అనారోగ్యంతో ఉన్నటువంటి వారిని గుర్తించి. అనారోగ్యంతో ఉన్నవారికి వైద్య ఖర్చులు నిమిత్తం ఆర్థిక సహాయం అందజేయడం అనేది చాలా మంచి కార్యక్రమం ఆయన ఈ సందర్భంగా అన్నారు.ఇటువంటి కార్యక్రమాలను ఈ ఆర్గనైజేషన్ ని ప్రోత్సహిస్తున్న వారికి పేరుపేరునా కృతజ్ఞతలు అని ఆయన తెలియజేశారు ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా రావటం చాలా ఆనంద నియకరంగా ఉందని ఇటువంటి కార్యక్రమాలకి ఎప్పుడు తన సహాయ సహకారాలు ఉంటాయని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు కార్యక్రమంలో కొండపాటూరు అనిల్ కుమార్ తాండ్ర సాంబశివరావు కొక్కిలిగడ్డ శ్రీనివాసరాజు ఉప్పాల మురళి షేక్ కరిముల్లా పాల్గొన్నారు,

## మూడు జిల్లాల్లో పిడుగులు
## పడే అవకాశం ఉంది : జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి




(శుభోదయం న్యూస్) బాపట్ల: 1. జిల్లాలో రాబోయే రెండు మూడు గంటల్లో ఉరుములతో కూడిన పిడుగులు పడే అవకాశం ఉంది ప్రజలు అప్రమత్తంగా ఉండాలి-జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి,2. జిల్లాలో రాబోయే రెండు మూడు గంటల్లో 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలి జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళీ 3.జిల్లాలో పిడుగులు పడే అవకాశం ఉందని ప్రాణ నష్టం జరగ కుండా ప్రజలను అప్రమత్తం చేయాలని - జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి 4. జిల్లాలో పిడుగులు పడే అవకాశం ఉన్నందున అధికారులు ప్రధాన కేంద్రంలో నివాసం ఉండాలని -జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి తెలిపారు,

# కార్యకర్తలే పార్టీకి బలం...
# మండల రెవెన్యూ అధికారుల పని తీరు మార్చుకోవాలి...
# విస్తృత స్థాయి సమావేశంలో ఎమ్మెల్యే కందికుంట..



నల్లచెరువు, మండలం రిపోర్టర్ - మాలిక్ బాషా, మే 05 (శుభోదయం న్యూస్) :పార్టీకి కార్యకర్తలే బలమని కదిరి శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక మండల కేంద్రంలోని గీతా మందిరంలో మండల కన్వీనర్ రాజశేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విస్తృత స్థాయి సమావేశానికి ఆయన హాజరయ్యారు.ఈ సందర్భంగా మండల ప్రజలు, నాయకులు,ప్రజాప్రతినిధులు, అధికారులు ఆయనకు ఘన స్వాగతం పలికారు.ఆయన మాట్లాడుతూ పార్టీ అధికారంలోకి రావడానికి కార్యకర్తలే ముఖ్య కారణమన్నారు.పార్టీకి బలం కార్యకర్తలేనన్నారు.కార్యకర్తలను పట్టించుకోకపోతే ఎంతటి నాయకులనైన సహించేది లేదన్నారు.మండలంలో పూర్తిగా నాయకుల పనితీరు లోపం బలంగా కనబడుతోందన్నారు.ప్రజా సమస్యలను పరిష్కరించడానికి కార్యకర్తలు మనలను నాయకులుగా ఎన్నుకున్నారన్న విషయాన్ని ప్రతి నాయకులు గుర్తుపెట్టుకోవాలన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆశయాల మేరకు అర్హులైన ప్రతి ఒక్కరికి కుల,మత, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందేలా చూడడమే నాయకుల కర్తవ్యమన్నారు.కార్యకర్తలను నిర్లక్ష్యం చేస్తే పార్టీకి,నాయకులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. మండలంలో,గ్రామాలలో మండల గ్రామస్థాయి నాయకుల ఆధ్వర్యంలో నెలకొకసారి జరగాల్సిన కార్యకర్తల సమావేశం ఇప్పటివరకు ఒక్కసారి కూడా ఎందుకు జరపలేదని మండల నాయకులను ప్రశ్నించారు. కార్యకర్తలతో గ్రామాలలో సమావేశాలు జరిపి వారి సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కార మార్గమే లక్ష్యంగా నాయకులు పనిచేయాలని సూచించారు.మండల గ్రామాలలో



నాయకుల పనితీరు ఇలానే ఉంటే స్థానిక సంస్థల ఎన్నికలలో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు.త్వరలో గ్రామస్థాయి,మండల స్థాయి క్లస్టర్ ఇన్చార్జిలు,బూత్ ఇన్చార్జిలు, మండల నాయకుల హోదాలలో మార్పుచేర్పులు ఉంటాయని తెలిపారు.బీసీ,మైనార్టీ,ఎస్సీ,ఎస్టీ కార్పొరేషన్ రుణాలలో అవకతవకలు జరిగితే సహించేది లేదన్నారు.ఎస్సీ కార్పొరేషన్ రుణాలు ఒక నల్లచెరువు మండలంలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా సమస్య ఉందన్నారు.అనంతరం మండల రెవెన్యూ అధికారులు తీరు మార్చుకోకపోతే చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.రెవెన్యూ అధికారులు పనితీరు సరిగ్గా లేదని నిత్యం రెవెన్యూ సమస్యలతో మండల ప్రజలు తమ వద్దకు వస్తున్నారన్నారు.అనంతరం వివిధ గ్రామాల నుండి కార్యక్రమానికి వచ్చిన కార్యకర్తలు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు.ఎమ్మెల్యే వాటిని పరిశీలించి వాటి పరిష్కారానికి నాయకులు,అధికారులు కృషి చేయాలన్నారు.కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి
## సీపీఎం అడ్డగుడూర్ మండల కార్యదర్శి బుర్రు అనిల్ కుమార్



అడ్డగూడూర్ ( శుభోదయం న్యూస్): అడ్డగుడూర్ మండల వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ నాయకులకు ఇవ్వడం విడురం. ఈ రోజు అడ్డగుడూర్ మండల కేంద్రంలో సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది.ఈ సందర్భంగా సీపీఎం అడ్డగుడూర్ మండల కార్యదర్శి బుర్రు అనిల్ కుమార్ మాట్లాడుతూ అడ్డగుడూర్ మండల వ్యాప్తంగా అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వకుండా కేవలం సొంతం పార్టీ నేతలకు ఇండ్లు ఇవ్వడాన్ని సీపీఎం పార్టీ గా ఖండిస్తున్నం.ప్రజా ప్రభుత్వం అని చెప్పుకునే నాయకులు పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందించకుండా కేవలం భజన పరులకు సంక్షేమ పథకాలు అందించడంలో ఏంటి ఆంతర్యం అన్ని అన్నారు.పేదలకు ఇళ్లు అందించకపోతే మండల వ్యాప్తంగా ఆందోళన కార్యక్రామలు చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో రచకొండ రవి,విద్యార్థి జనసమితి నాయకులు డప్పు గోపి,ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.

## సీబీఐటీ ఎంసీఏ
## విద్యార్థులకు టెక్స్ అకాడమీ ఉచిత కంప్యూటర్ కోర్సులు



హైదరాబాద్, శుభోదయం న్యూస్, మే 5 : చైతన్య భారతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, గండిపేటలోని ఎం.సి.ఎ విభాగానికి చెందిన విద్యార్థుల కోసం టెక్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఉచిత ఆన్లైన్ స్కాలర్షిప్ పరీక్ష నిర్వహించబడింది. ఈ పరీక్ష ద్వారా ఎంపికైన విద్యార్థులకు ఉచితంగా ప్రామాణిక కంప్యూటర్ కోర్సులు అందించనున్నట్లు తెలియజేశారు.ఈ సందర్భంగా, టెక్స్ అకాడమీకి ధన్యవాదాలు తెలియజేస్తూ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సీ. వి. నర్సింహులు మాట్లాడుతూ, ఈ అవకాశాన్ని విజయవంతంగా ఉపయోగించుకున్న ఎంసీఏ రెండవ సెమిస్టర్ చదువుతున్న విద్యార్థులు కె సాయి ఈశ్వర్ కుమార్ మరియు ఎమ్ కె లావణ్య తమ జీవితాలలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.ఎంసీఏ విభాగాధిపతి డాక్టర్ బి. ఇందిరా గారు మాట్లాడుతూ, "ఇలాంటి ఉచిత స్కాలర్షిప్ పరీక్షలు, శిక్షణ కోర్సులు మరియు ప్లేస్మెంట్ డ్రైవ్లు విద్యార్థుల ప్రకాశవంతమైన భవిష్యత్తుకు మార్గనిర్దేశకాలు అవుతాయి," అని పేర్కొన్నారు.ఈ సందర్భంగా సి బి ఐ టి ప్రజాసంబంధాల అధికారి డాక్టర్ జి.ఎన్.ఆర్. ప్రసాద్ మాట్లాడుతూ, విద్యార్థులు చదువు మాత్రమే కాకుండా జీవితంలో నిరంతర కృషితో గొప్ప విజయాలు సాధించవచ్చని అన్నారు.టెక్స్ అకాడమీ కార్పొరేట్ కమ్యూనికేషన్స్ మేనేజర్ మోహన్ దాస్ మాట్లాడుతూ, స్కాలర్షిప్ పరీక్షలో విజయం సాధించిన విద్యార్థులు కోర్సులు పూర్తి చేసిన తర్వాత టెక్స్ అకాడమీ గ్రూప్ ఆఫ్ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు పొందగలరని తెలిపారు.ఈ కార్యక్రమంలో సిబిఐటి అధ్యాపకులు, సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## అన్నప్రాసన కార్యక్రమాన్ని పురస్కరించుకొని లైబ్రరీకి పుస్తకాలు అందజేత సీనియర్ పాఠకుడు, సామాజిక వేత్త గడ్డం మధు ఆధ్వర్యంలో



రామగుండం, మండలం రిపోర్టర్ - తిరుపతి, (శుభోదయం న్యూస్): జీనియస్ పబ్లికేషన్స్ అధినేత శ్రీ రఘు దేపాక వారి కుమారుడు మరియు కూతురు గార్ల అన్నప్రాసన కార్యక్రమాన్ని పురస్కరించుకుని స్థానిక గోదావరిఖని ప్రభుత్వ లైబ్రరీలో గ్రూప్స్ మరియు ఇతర పోటీ పరీక్షలకు సన్నద్ధం అవుతున్న స్థానిక నిరుద్యోగ యువతకోసం యాభై వేలు (50000) రూపాయలు విలువచేసే పుస్తకాలను లైబ్రరీ కీ ఉచితంగా అందచేశారు. ఈసందర్భంగా శ్రీ రఘు దేపాక మాట్లాడుతూ అందరూ కష్టపడి చదివి ఉన్నత స్థాయిలో ఉండాలని కోరారు. వీలైతే ఇంకా పుస్తకాలు మరిన్నీ పుస్తకాలు అందచేస్తానని తెలిపారు. సీనియర్ పాఠకుడు,సామాజిక వేత్త గడ్డం మధు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జీనియస్ పబ్లికేషన్ ఫౌండర్ రఘు దేపాక గారు, సుఖేష్ గౌడ్,నదీమ్ (ఎకానమీ ఫ్యాకల్టీ ), ఏ. విష్ణు (కరెంట్ ఎఫైర్స్ మల్టీమీడియా ఫాకల్టీ ),గ్రూప్ 2 ర్యాంకర్ ధన్ సింగ్ రాథోడ్, ప్రభుత్వ ఉపాధ్యాయులు ఈర్ల రమేష్ మరియు గడ్డం మధు మరియు గ్రంధాలయ పాఠకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గడ్డం మధు మరియు పాఠకులు జీనియస్ పబ్లికేషన్స్ అధినేత రఘు దీపాక గారినీ ఘనంగా సన్మానించారు.

## మే20 న జరిగే దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి



వలిగొండ మండల రిపోర్టర్ (శుభోదయం న్యూస్):మే 20 న కార్మిక చట్టాల రక్షణ, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం దేశవ్యాప్తంగా చేపట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సిర్పంగి స్వామి కార్మికులకు పిలుపునిచ్చారు.సోమవారం మండల పరిధిలోని వర్కట్ పల్లి గ్రామంలో గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న వ్యవసాయ కూలీలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర అధికార బిజెపి ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేస్తూ నాలుగు లేబర్ కోడ్లను ఏర్పాటు చేసిందని దీని ద్వారా కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులు పోయాయని దీనికి వ్యతిరేకంగా వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులందరూ మరియు ట్రేడ్ యూనియన్లు మరియు వ్యవసాయ కార్మిక సంఘాలు రైతు సంఘాలు దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చాయని తెలిపారు.దేశంలో 2004 ముందు లో కరువు ఎదురైనప్పుడు కరువును నివారించేందుకు వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా పోరాడిన ఫలితంగా మరియు యూపీఏ-1 కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రభుత్వ ఏర్పాటుకు బహిరంగ మద్దతునిచ్చిన వామపక్షాలు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని సాధించి పెడితే నేడు మోడీ ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తూ పేదలకు పనిని దూరం చేసే కుట్రలు చేస్తుందని నిధుల కేటాయింపు చట్ట రక్షణ కూలీల సమస్యల సాధనకై జరుగుతున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో వ్యవసాయ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మీసాల పోశయ్య,బంగారి బిక్షపతి, ఐతరాజు నరసింహ, మీసాల ఇస్తారు, సిర్పంగి సత్తమ్మ, కూలీలు లోతుమల్ల వనజ,పోతరాజు భ్రమరాంబ,గుండు లావణ్య, బంగారి యాదమ్మ, మీసాల అండాలు, హంసమ్మ,మారమ్మ,షేక్ కరీం,మీసాల నరసింహ, మాదుగుల భారతమ్మ,కందుకూరి రాజు తదితరులు పాల్గొన్నారు.

శుభోదయం

సంపాదకీయం

# పదునైన వ్యూహంతో...

## (విశ్లేషణ)

ప్రతీకారం దిశగా ఒక్కో అడుగే పడుతోంది. పహల్గాం సమీపంలో వారం రోజుల క్రితం 26 మంది పర్యాటకుల ప్రాణాలు తీసిన ఉగ్రవాదుల వేటకు రంగం సిద్ధమవుతోంది. దాడి ఎప్పుడు ఎక్కడ ఏ విధంగా జరగాలో నిర్ణయం తీసుకునే స్వేచ్ఛను త్రివిధ దళాధిపతులకు ఇస్తూ ప్రధాని నరేంద్ర మోదీ, రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ మంగళవారం తీసుకున్న నిర్ణయం అసాధారణమైనది. దాంతోపాటు జాతీయ భద్రతా సలహా బోర్డు(ఎన్ఎస్ఏబీ)ను బుధవారం పునర్వ్యవస్థీకరించటం కూడా కీలక పరిణామం. 'రా' మాజీ చీఫ్ అలోక్ జోషి సారథ్యంలో ఏర్పాటైన ఈ బోర్డు జాతీయ భద్రతా మండలి సెక్రటేరియట్‌కు అవసరమైన సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందజేస్తుందంటున్నారు. పదునైన వ్యూహం, పక్కా ప్రణాళిక, మెరికల్లాంటి దళాలను కీలక ప్రాంతాల్లో మోహరించటం వగైరాలన్నీ ఇలాంటి సమయాల్లో అత్యంత అవసరం. ఇప్పటికే పహల్గాం మారణకాండను తక్కువ చేసి చూపటానికి పాకిస్తాన్ చేయాల్సిందంతా చేస్తోంది. దాదాపు 45 యేళ్లుగా దాని వ్యూహం ఇదే.ఒకపక్క ఎల్ఓసీలో వరసగా కాల్పుల విరమణను ఉల్లంఘిస్తూ, సరిహద్దుల్లో నిఘా రాడార్లు, యుద్ధ సామగ్రి తరలిస్తూ మరోపక్క అమెరికా తదితర దేశాలముందు తన అమాయ కత్వాన్ని చాటుకోవటానికి ప్రయత్నిస్తోంది. మారణకాండ గురించి 'నమ్మదగ్గ సమాచారం' ఇస్తే చర్యలు తీసుకుంటామని చెప్పటం ఇప్పటి షెహబాజ్ సర్కార్‌కి మాత్రమే కాదు... కుట్రపూరితంగానో, ఎన్నికల మాటున సైన్యం ప్రాపకంతోనో అధికారాన్ని చేజిక్కించుకుంటూ వస్తున్న పాక్ అధినేతలందరికీ అలవాటైన విద్య. దీనికి ఎక్కడో అక్కడ అడ్డుకట్ట పడటం తప్పనిసరి. అందుకే ప్రభుత్వ తాజా నిర్ణయం అన్నివిధాలా ఆహ్వానించదగ్గది.మన సహనాన్ని చేతగానితనంగా, మన సుహృద్భావాన్ని అశక్తతగా భావించటం పాకిస్తాన్‌కు అలవాటైంది. మొన్న జరిగిన మారణకాండ అనంతరం దేశవ్యాప్తంగా ప్రజలందరూ ప్రతీకారేచ్ఛతో రగులుతున్నారు. కేవలం దాన్ని సంతృప్తిపరచటమే అంతిమ లక్ష్యం కారాదు. తాజా దాడిలో పాకి స్తాన్ సైన్యంలో పారా కమాండోగా పనిచేసిన హాషీం మూసా అనే ఉగ్రవాది పాల్గొనటాన్నిబట్టి చూస్తే ఐఎస్ఐ పాత్రవుందని అర్థమవుతోంది. ఇలాంటివి నివారించాలంటే సరిహద్దుల్లో పటిష్టమైన నిఘావుండాలి. దాంతోపాటు వేర్వేరు సమయాల్లో జరిగిన దాడుల స్వభావాన్ని అధ్యయనం చేయాలి.నిరుడు అక్టోబర్‌లో మధ్య కశ్మీర్‌లో ఏడుగురు కార్మికులను పొట్టనబెట్టుకున్నది మొదలు మొన్నటి పహల్గాం మారణకాండ వరకూ జరిగిన నాలుగు ఉదంతాల్లో కీలకపాత్ర పోషించింది మూసాయే అంటున్నారు. అదే నిజమైతే మన నిఘా వ్యవస్థ సక్రమంగా లేదని భావించాలి. మొన్న విపక్షాలతో జరిగిన సమావేశంలో కూడా కేంద్ర ప్రభుత్వం నిఘా వైఫల్యం ఉన్నదని అంగీకరించింది. కనుక పాకిస్తాన్ ప్రాపకంతో చెలరేగుతున్న ఉగ్రవాదులను గురిచూసి కొట్టటానికి తగిన చర్యలు తీసుకుంటున్నట్టే మన నిఘా వ్యవస్థను కూడా మరింత పటిష్టం చేయాలి.జవాబుదారీ తనాన్ని నిర్ధారించాలి. ఉగ్రవాదులు మన లోటుపాట్లేమున్నాయో చూసుకునే దాడులకు దిగుతారు. ఆ పని మన నిఘా వర్గాలు చేయగలిగితే ఉగ్రవాదుల్ని నిరోధించటంతోపాటు వారిని చాకచక్యంగా పట్టి బంధించటానికి కూడా వీలవుతుంది. అప్రమత్తత లోపించటంవల్ల నిరాయుధ పౌరుల ప్రాణాలు మాత్రమేకాదు... స్థానికుల జీవిక కూడా దెబ్బతింటుంది. తాజాగా ఉద్రిక్తతలు పెరిగిన నేపథ్యంలో కశ్మీర్‌లోని 50కి పైగా పర్యాటక స్థలాలను మూసివేసినట్టు అధికారులు ప్రకటిస్తున్నారు. అంటే కొన్ని వేల కుటుంబాల ఉపాధి దెబ్బతింటుంది. ముమ్ముందు తెరిచినా అటువైపు వెళ్లేందుకు పర్యాటకులు జంకుతారు గనుక ఆ రంగం కోలుకోవటానికి చాలా సమయం పడుతుంది.అన్నిటికన్నా మన నేతలు మాటలూ, చేతలూ అదుపులో పెట్టుకోవటం ప్రస్తుత పరిస్థితుల్లో అత్యవసరం. రెండు పక్షాలు పరస్పరం తలపడుతున్నప్పుడు ఎవరి బలం ఎక్కువన్న దాన్నిబట్టి ఫలితం ఆధారపడి వుండదు. ఎవరు కలిసికట్టుగా ఉన్నారో, ఎవరు మెరుగైన వ్యూహం పన్ను తున్నారో, ఎవరి ఎత్తుగడలు సరైనవో వారినే విజయం వరిస్తుంది. జరిగిన భద్రతాలోపాలకు బాధ్యులెవరో నిర్ణయించాలని అనటం, వారిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరటం వరకూ ఎవరికీ అభ్యంతరం ఉండదు. నిర్మాణాత్మకమైన విమర్శలూ ఆహ్వానించదగ్గవే. కానీ ప్రధాని చిత్రాన్ని ఒక పార్టీ తప్పుడుగా చిత్రిస్తే, మరొకరు దానికి జవాబుగా విపక్షనేత వెన్నుపోటుకు సిద్ధంగా వున్నట్టు మరో చిత్రాన్ని సామాజిక మాధ్యమాల్లో పెట్టారు. ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కాంగ్రెస్ నేతల్ని పాకిస్తాన్ పొమ్మంటూ ఉచిత సలహా ఇచ్చారు. 26 మంది అమాయకుల ఉసురు తీసిన ఉగ్రవాదులను ఏరిపారేయటానికి ఏం చేయాలన్న అంశంలో మన భద్రతా వ్యవస్థ తలమునకలై వుంది. ఈ పరిస్థితుల్లో ఐక్యతను చాటి ఆదర్శంగా వుండాల్సిన నాయకులు దిగజారుడు పోస్టులతో అధ్వాన్నంగా ప్రవర్తిస్తున్నారు.ఇదంతా దేశభక్తి అనే భ్రమలో వీరు కాలక్షేపం చేస్తున్నారు. వీరిని చూసి అనుచరగణాలు మరింత రెచ్చిపోతున్నాయి. మతం పేరిట, ప్రాంతం పేరిట విద్వేషాలు రెచ్చగొడుతున్నాయి. ఫలితంగా వేర్వేరు ప్రాంతాల్లోని కశ్మీరీ చిరువ్యాపారుల పైనా, విద్యార్థుల పైనా దాడులు జరుగుతున్నాయి. ఇదంతా మనపై మనమే యుద్ధం చేసుకోవటం. శత్రువుపై సమష్టిగా పోరాడాల్సిన సమయంలో బాధ్యత మరిచి అంతర్గత కలహాలకు దారితీసేలా ప్రవర్తించటం, పైస్థాయి నేతల ప్రాపకానికి వెంపర్లాడటం అత్యంత హీనం. పాపం. సక్రమంగా మాట్లాడటంరాని నేతలు కొన్నాళ్లయినా నోరుమూసుకోవటం ఉత్తమం.

# ప్రధాని మోదీ వరుస సమావేశాలు.. వైమానిక దళ అధిపతితో భేటీ.. ఉలిక్కిపడ్డ పాకిస్థాన్!



మే 9వ తేదీలోపే పాకిస్తాన్ మీద భారత్ ఎటాక్ చేయబోతోందా? పహల్గామ్‌లో ఉగ్రదాడి చేసిన పాకిస్తాన్‌ని రౌండప్ చేసే ప్రక్రియలో సైనికచర్య ఖాయమా? ఢిల్లీలో సాగుతున్న వరుస సమావేశాలు ఈ విషయాన్నే చెబుతున్నాయి. పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత వ్యూహరచనలో కేంద్రం బిజీ బిజీగా ఉంది. ఈ క్రమంలోనే ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వరుస సమావేశాలు నిర్వహించడం కీలకంగా మారింది. ఎయిర్ చీఫ్ మార్షల్ %ూా% సింగ్ ప్రధాని మోదీతో భేటీ కావడం మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. పహల్గామ్‌లో ఉగ్రవాద దాడి తర్వాత భారత్, పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తత పెరిగింది. ఈ క్రమంలోనే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆదివారం వైమానిక దళ చీఫ్ ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్‌తో ప్రధానమంత్రి నివాసంలో సమావేశమయ్యారు. ఇద్దరి మధ్య 40 నిమిసాల పాటు సమావేశం కొనసాగింది. సరిహద్దుల్లో వాయుసేన సన్నాహకాలను ప్రధాని ఆయన వివరించారు. శనివారం నేవీ చీఫ్ దినేష్ త్రిపాఠి ప్రధానితో సమావేశం అయ్యారు. పాకిస్తాన్‌ను దీటుగా ఎదుర్కోవడానికి నేవీ ఎలాంటి చర్యలు చేపట్టిందో ప్రధానికి త్రిపాఠి వివరించారు. అంతేకాదు, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, ప్రధానితో సమావేశం కావడం కూడా ప్రాధాన్యం సంతరించుకుంది. వైమానిక దళ చీఫ్ ఎయిర్ మార్షల్ ఏపీ సింగ్ తో ప్రధాని మోదీ జరిపిన ఈ సమావేశంలో, పహల్గామ్ ఉగ్రవాద దాడి తర్వాత వైమానిక దళం సన్నద్ధత గురించి చర్చించారు. 2019 ఫిబ్రవరిలో పుల్వామాలో జరిగిన చివరి పెద్ద ఉగ్రవాద దాడికి భారత వైమానిక దళం జెట్ విమానాలతో గట్టి బుద్ధి చెప్పింది. పాకిస్తాన్‌లోని బాలాకోట్‌పై బాంబు దాడి చేయడం ద్వారా ప్రతిస్పందించింది పాక్. ఈ నేపథ్యంలోనే ప్రధాని మోదీ ఎయిర్ చీఫ్ మార్షల్ మధ్య జరిగిన ఈ సమావేశం మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. పహల్గామ్ దాడి తర్వాత ప్రధాని మోదీ ఎయిర్ చీఫ్ మార్షల్‌తో ముఖాముఖి సమావేశం నిర్వహించారు.పుల్వామా దాడికి పాకిస్తాన్‌కు భారతదేశం తగిన సమాధానం ఇచ్చింది. అప్పటి నుండి భారత వైమానిక దళ బలం దీర్ఘ-శ్రేణి క్షిపణులు, వైమానిక రక్షణ పరంగా గణనీయంగా పెరిగింది. బాలకోట్ దాడి తర్వాత ప్రవేశపెట్టిన రాఫెల్ జెట్‌లు లక్ష్యాలను ఖచ్చితంగా ఛేదించగల క్షిపణులతో అమర్చారు. పుల్వామా దాడి తర్వాత, పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడిని అతిపెద్ద ఉగ్రవాద దాడిగా పరిగణిస్తున్నారు. ఈ కారణంగా, ఈ దాడికి సంబంధించి ప్రధాని మోదీ నిరంతరం ఆర్మీ చీఫ్, ఎయిర్ చీఫ్, నేవీ చీఫ్‌లతో సమావేశమై చర్చిస్తున్నారు. ఈ దాడి ఏప్రిల్ 22న జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగింది. ఈ దుర్ఘటనలో, ఉగ్రవాదులు పర్యాటకులను లక్ష్యంగా చేసుకున్నారు. పర్యాటకులపై కాల్పులు జరిపారు. 26 మంది మరణించారు. అదే సమయంలో, చాలా మంది గాయపడ్డారు. పహల్గామ్ దాడి తర్వాత, ప్రధాని మోదీ యాక్షన్ మోడ్‌లో ఉన్నారు. ఏప్రిల్ 29న జాతీయ భద్రతపై ఒక ముఖ్యమైన ఉన్నత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు ప్రధాని. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, జాతీయ భద్రతా సలహాదారు (ఎన్ఎస్ఏ) అజిత్ దోవల్, త్రివిధ దళాల అధిపతులు, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సిడిఎస్) జనరల్ అనిల్ చౌహాన్ ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సమావేశంలో, ఉగ్రవాదులు, వారి వెనుక ఉన్నవారిపై కఠిన చర్యలు తీసుకోవడానికి సైన్యానికి పూర్తి స్వేచ్ఛనిస్తున్నట్లు ప్రధాని మోదీ ప్రకటించారు. సైన్యం ఎప్పుడు కావాలంటే అప్పుడు, ఏ విధంగా కావాలంటే ఆ ఆపరేషన్ నిర్వహించుకునే స్వేచ్ఛ ఉందని ప్రధాని స్పష్టం చేశారు. దీంతో త్రివిధ దళాలు దూకుడు పెంచాయి. దీంతో పాకిస్థాన్ వెన్నులో వణుకుపుడుతోంది.

# సామాజిక సమానత్వం రావాలంటే.. జనగణనలో కులగణన చేస్తేనే సరిపోదు!





జనగణనలో కులగణన చేయాలనే డిమాండ్ చాలా కాలంగా ఉంది. కానీ కేంద్రం మాత్రం ఈ విధానం వల్ల దేశ ఐక్యత దెబ్బతింటుందని తోసిపుచ్చుతూ వచ్చింది. కానీ ప్రస్తుతం కేంద్రం ప్రభుత్వం జన గణనలో కులగణనని చేస్తామని నిర్ణయం తీసుకోవడం హర్షించదగ్గ పరిణామం.అయితే ఇల్లు అలుకగానే పండుగా కాదన్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన వెంబడే సంబరపడిపోకూడదు. కులగణన రిపోర్టు కనుగుణంగా మండల కమిషన్ సూచించిన 40 సిఫార్సులను అమలు చేయాలి. అప్పుడే జనగణనలో కులగణన చేపట్టిన దానికి సార్ధకత చేకూరుతుంది.చరిత్ర అన్నివేళలా ఒకేలా ఉండదు. కాలమాన పరిస్థితులకు తగ్గట్లు మారుతూ ఉంటుంది. కారల్ మార్క్స్ చెప్పినట్లు చరిత్ర అంటే వర్గ పోరాటమే. 19వ శతాబ్దంలో సాంఘిక సంస్కరణ ఉద్యమం, 20వ శతాబ్దంలో జాతీయ స్వాతంత్ర్య పోరాటం, ప్రాంతీయ అస్తిత్వ ఉద్యమాలు, ప్రస్తుతం 21వ శతాబ్దంలో రాజకీయ, సామాజిక, ఆర్థిక రంగాల్లో సరియైన ప్రాతినిధ్యం లేకపోవడాన్ని ప్రశ్నిస్తూ జనగణనలో కులగణనకై ఉద్యమం. ఇలా ఆయా కాలాల్లో ఆయా ఉద్యమాలు సమాజంపై ప్రభావాన్ని చూపుతూ చరిత్రగా నిలిచిపోయాయి.

చాలా కాలంగా ఉన్న డిమాండ్

జనగణనలో కులగణన చేయాలనే డిమాండ్ చాలా కాలంగా ఉంది. 1931 జనాభా లెక్కల నేపథ్యంలో జనగణనలో కులగణన చేయాలనే ప్రతిపాదన 1951 జనాభా లెక్కల సందర్భంగా ముందుకొచ్చినప్పటికీ కేవలం ఎస్సీ, ఎస్టీల జనాభాను మాత్రమే లెక్కించాలని కేంద్రం నిర్ణయం తీసుకుంది. మొదటి బీసీ కమిషన్, కాక కాళేశ్వర్ కమిషన్ సందర్భంగా, రెండవ బీసీ కమిషన్ మండల కమిషన్ సందర్భంగా జనగణలో కులగణన చర్చకు వచ్చింది. అయినా కేంద్రం ప్రభుత్వం ఒప్పుకోలేదు. ఇందిరా సహాని కేసులో సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో కూడా జనగణలో కులగణన డిమాండ్ మరోసారి ముందుకొచ్చింది. ఇలా ఎన్నోసార్లు ఈ డిమాండ్ ముందుకొచ్చినప్పటికీ కేంద్రం మాత్రం జనగణనలో కులగణన వల్ల దేశ ఐక్యత దెబ్బతింటుందని తోసిపుచ్చుతూ వచ్చింది. భాషా సంయుక్త రాష్ట్రాల విషయంలో కూడా ఈ రకమైన అభిప్రాయంతో అప్పటి నెహ్రూ ప్రభుత్వం ఉన్నప్పటికీ తప్పని పరిస్థితుల్లో భాషా సంయుక్త రాష్ట్రాలు ఏర్పాటు అయ్యాయి. 70 సంవత్సరాల భాష సంయుక్త రాష్ట్రాల చరిత్రలో దేశాన్ని విచ్ఛిన్నం చేయగల అనైక్యత ఎక్కడా సంభవించలేదని చెప్పవచ్చు. అంటే ఒక విషయంపై మనలో చాలాకాలంగా గూడు కట్టుకున్న ఆలోచనలు వాస్తవం కాదని తేలిపోయింది.

ఈ ఘనత కాంగ్రెస్ పార్టీదే!

జనగణనలో కుల గణన చేయాలనే డిమాండ్ వచ్చినప్పుడల్లా తోసిపుచ్చిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదే. 2011లో కాంగ్రెస్ ఆధ్వర్యంలోని యూపీఏ ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో సామాజిక, ఆర్థిక, కులగణన చేయడం జనగణనలో కులగణనకు మొదటిమెట్టుగా చెప్పవచ్చు. ప్రస్తుత ఎన్డీఏ ప్రభుత్వం జన గణనలో కుల గణనని వ్యతిరేకించినప్పటికీ ప్రస్తుతం అది చేస్తామని నిర్ణయం తీసుకోవడం హర్షించదగ్గ పరిణామం. అయితే ఈ ఘనత మాత్రం దేశ వ్యాప్తంగా ఈ వాదాన్ని చర్చకు తెచ్చిన కాంగ్రెస్ పార్టీది, ఆయా రాష్ట్రాల్లో జనగణనలో కులగణనకై డిమాండ్ చేసిన డీఎంకే, ఎస్పీ, ఆర్జేడీ లాంటి ప్రాంతీయ పార్టీలది, కులగణన చేయడమే కాదు, విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తూ శాసనసభ చట్టం చేసిన తెలంగాణ రాష్ట్రానిదే. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రలో కులగణనకు డిమాండ్ చేయడం, కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా కులగణనకు వాగ్దానం చేయడం, రాష్ట్రంలో కామారెడ్డి డిక్లరేషన్ ప్రకటించడం, బీసీ సంఘాల ఒత్తిడి నేపథ్యంలో కులగణన జరగడం, విద్యా ఉద్యోగ స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ల పెంపుకై శాసనసభ చట్టం చేస్తూ కేంద్రానికి పంపడం చకచగా జరిగిపోయాయి. 42శాతం రిజర్వేషన్లు అమలు కోసం బీసీ సంఘాలు ఢిల్లీలో "జంతర్ మంతర్" వద్ద డిమాండ్ చేయడంతో కులగణనపై కేంద్రం ఆలోచనలో మార్పు వచ్చి ఉండొచ్చు. అలాగే కర్ణాటక, తెలంగాణతో పాటు బిహార్ లాంటి రాష్ట్రాలు కులగణన పూర్తి చేయడం దేశంలో చాలా రాష్ట్రాల్లో కులగణనకై డిమాండ్లు వినిపించడంతో ఒక్కసారిగా కేంద్రం పునరాలోచనలో పడి ఉండవచ్చు. ఇక గత పార్లమెంట్ ఎన్నికల్లో మెజార్టీ తగ్గడం, రానున్న బిహార్, పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో జన గణలో కులగణననే ప్రధాన ప్రచారంశంగా ఉండడంతో కేంద్రం ఆలోచన మారి ఉండవచ్చు.

ఇల్లు అలుకగానే పండగా కాదు

జనగణనలో కులగణన చేపడతామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడాన్ని స్వాగతించాల్సిందే. అయితే ఇల్లు అలుకగానే పండుగా కాదన్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన వెంబడి సంబరపడిపోకూడదు. ఈ గణనకై కేంద్ర ప్రభుత్వం తీసుకురానున్న మార్గదర్శకాలను బీసీ సమాజం నిశితంగా గమనించాలి. జనగణనలో కులగణన చేస్తే సరిపోదు. కులగణన రిపోర్టు కనుగుణంగా మండల కమిషన్ సూచించిన 40 సిఫారసులను అమలు చేయాలి. సామాజిక, రాజకీయ, ఆర్థిక, విద్య ఉద్యోగ రంగాల్లో సమానత్వం సాధించే దిశగా తగిన చర్యలు తీసుకోవాలి. అప్పుడే జనగణనలో కులగణన చేపట్టిన దానికి సార్థకత చేకూరుతుంది. రాజ్యాంగ సభలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశించిన రాజకీయ, సామాజిక, ఆర్థిక సమానత్వం సాధించబడుతుంది.

# పేరుకే ప్రజాస్వామ్య దేశం.. పత్రికా స్వేచ్ఛ ఏది?







పత్రికలు ప్రజాస్వామ్య సౌదానికొక మూలస్తంభం లాంటివి. కావున పత్రికలకు స్వేచ్ఛ అత్యవసరం. ఈ నేపథ్యంలో మే 3న అంతర్జాతీయ పత్రికా దినోత్సవం జరుపుకుంటున్నాం. ఈ సంద ర్భంగా మీడియా స్వేచ్ఛను, ప్రాథమిక సూత్రాలను ప్రోత్సహించడం జరుగుతుంది. ప్రపంచవ్యాప్తంగా పత్రికా స్వేచ్ఛ తీరుతెన్నులను తెలిపే వరల్డ్ ప్రెస్ ఫ్రీడం ఇండెక్స్‌ను ప్యారిస్‌లోని రిపోర్టర్స్ వితౌట్ బార్డర్స్ అనే సంస్థ ప్రతి ఏటా విడుదల చేస్తుంది. ఈ సంస్థ మొన్న విడుదల చేసిన పత్రికా స్వేచ్ఛ సూచీలో 180 దేశాలకుగాను భారత్ 151 స్థానంలో నిలిచింది. గతేడాది 159 స్థానంలో కన్నా ఈ సారి ఈ ర్యాంకు కొంచెం మెరుగుపడింది. కానీ పొరుగు దేశాలైన నేపాల్ (90వ స్థానం), మాల్దీవులు (104), శ్రీలంక (139), బంగ్లాదేశ్ (149) కంటే భారత్ దిగువనే ఉంది. ఈ సూచీలో నార్వే, ఎస్టోనియా, నెదర్లాండ్‌లు వరుసగా మొదటి మూడు స్థానాల్లో ఉండగా.. ఎరిత్రియా అట్టడుగున ఉంది. అయితే ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌లో పత్రికా స్వేచ్ఛ "చాలా తీవ్రమైన" కేటగిరీలోనే ఉందని రిపోర్టర్స్ వితౌట్ బోర్డర్స్ తెలిపింది. అంతేకాకుండా మీడియా రాజకీయ నాయకుల యాజమాన్యంలో ఉండి, పత్రికా స్వేచ్ఛకు ముప్పు ఉన్న దేశాల జాబితాలో భారతదేశం ఉందన్నది. మరోవైపు గతేడాది యునెస్కో ప్రపంచ వ్యాప్తంగా పర్యావరణ జర్నలిస్టులపై హింస పెరుగుతున్నట్లు ఓ నివేదికను విడుదల చేసింది. గత 15 సంవత్సరాలలో ప్రపంచవ్యాప్తంగా పర్యావరణ జర్నలిస్టులలో 44 మంది జర్నలిస్టులు చంపబడ్డారని పేర్కొన్నది. ఆసియా పసిఫిక్ ప్రాంతంలో అత్యధిక హత్యల సంఖ్యను చూపిస్తుంది. భూగోళ సంరక్షణలో పర్యావరణ నష్టంపై వార్తలు వెలికి తీయడమే దీనికి కారణం. ప్రజాస్వామ్య వికాసానికి పత్రికా స్వేచ్ఛ ఎంత అవసరమో పత్రికా స్వేచ్ఛ వర్ధిల్లడానికి ప్రజాస్వామ్యం అంతే అవసరం. కావున ప్రజలు, ప్రజాస్వామికవాదులు, మేధావులు, ప్రజా సం ఘాలు, ప్రభుత్వాలు పత్రికా స్వేచ్ఛకు వెన్నుదన్నుగా నిలవాల్సిన అవసరం ఉంది.

## బాగ్లిహార్ డ్యామ్‌కి నీటిని నిలిపివేసిన భారత్



న్యూఢిల్లీ : చీనాబ్‌నదిపై ఉన్న బాగ్లిహార్ డ్యామ్‌కి భారత్ నీటి ప్రవాహాన్ని నిలిపివేసిందని సంబంధితవర్గాలు సోమవారం వెల్లడించాయి. జీలం నదిపై ఉన్న కిషన్‌గంగా డ్యామ్‌పై కూడా నీటిని నిలిపివేసే చర్యలను చేపట్టాలని యోచిస్తున్నట్లు ఆ వర్గాలు తెలిపాయి. జమ్ములోని రాంబన్‌లోని బాగ్లిహార్ మరియు ఉత్తర కాశ్మీర్‌లోని కిషన్‌గంగా జల విద్యుత్ డ్యామ్‌ల నీటివిడుదల సమయాన్ని భారత్ నియంత్రిస్తోంది. ఇప్పటికే చీనాబ్ నదిపై ఉన్న సలాల్ డ్యామ్ అన్నిగేట్లను భారత ప్రభుత్వం మూసివేసింది. దీంతో సోమవారం రియాసి జిల్లాలో నీట మట్ట గణనీయంగా పడిపోయింది. జమ్ముకాశ్మీర్‌లోని అఖ్నూర్ సెక్టార్‌లో భారీ వర్షపాతం కారణంగా మే 2న చీనాబ్ నది నీటి మట్టం పెరిగింది. జమ్ముకాశ్మీర్‌లోని పహల్గాంపై ఉగ్రదాడి అనంతరం తక్షణమే అమల్లోకి వచ్చేలా భారత్ సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేయాలని భారత్ నిర్ణయించిన సంగతి తెలిసిందే. బాగ్లిహార్ డ్యామ్ పాకిస్థాన్, భారత్‌ల మధ్య చాలాకాలంగా వివాదానికి కేంద్రంగా ఉంది. ఈ అంశంపై పాక్ గతంలో ప్రపంచ బ్యాంక్ మధ్యవర్తిత్వాన్ని కోరింది. జీలం ఉపనది అయిన నీలంనదిపై కిషన్‌గంగా డ్యామ్ ప్రభావంపై చట్టపరమైన, దౌత్య వివాదాలను ఎదుర్కొంది.

## భారత్ వర్సెస్ పాక్ - ఐ.రా.సలో కీలక చర్చ




న్యూయార్క్ : పాకిస్థాన్-భారతదేశం మధ్య నెలకొన్న ఉద్రిక్తతల గురించి ఐక్యరాజ్యసమితిలో నేడు కీలక చర్చ జరగనుంది. అంతర్జాతీయ సమాజం ముందు ఇరు దేశాలు తమ తమ వాదనలు వినిపించనున్నాయి. ఏప్రిల్ 22న జమ్మూ కాశ్మీర్ అనంత్‌నాగ్ జిల్లా పహల్గాం పట్టణంలో జరిగిన ఉగ్రదాడి నేపథ్యంలో పాక్‌పై భారత్ పలు ఆంక్షలు విధించింది. పాక్ కూడా కౌంటర్ ఆంక్షలు విధిస్తోంది. ముఖ్యంగా భారత్ సింధు జలాలను నిలిపివేయడాన్ని "యుద్ధం"గానే పాక్ భావిస్తోంది. ఈ క్రమంలో ఈ పరిణామాలపై ఆదివారం పాక్ విదేశాంగ ప్రతినిధి ఒకరు స్పందించారు. భారత్ దూకుడుగా వ్యవహరిస్తూ తమను(పాక్)ను ఇబ్బంది పెడుతోందని, రెచ్చగొట్టే ప్రకటనలు చేస్తోందని అన్నారు. మరీ ముఖ్యంగా సింధు జలాల ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూ భారత్ అక్రమంగా వ్యవహరిస్తోందని, ఈ విషయాలన్ని భద్రతా మండలి సమావేశంలో లేవనెత్తుతామని చెప్పారు. ఐక్య రాజ్య సమితి స్పందిస్తూ ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా తాము వ్యతిరేకిస్తామని, అదే సమయంలో ఆ ప్రాంతంలో పెరుగుతున్న ఉద్రిక్తతలపై ఆందోళన చెందుతున్నామని వెల్లడించింది. ఈ క్రమంలో భద్రతా మండలిలో చర్చ జరగనుంది.

## తడిసిన ధాన్యాన్ని పరిశీలించిన మంత్రి మనోహర్



పెద్దాపురం : అకాల వర్షాలకు కల్లాలలో తడిసిపోయిన ధాన్యాన్ని రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ పరిశీలించారు. సోమవారం ఆయన పెద్దాపురం మండలం జే తిమ్మాపురం గ్రామంలో రెవెన్యూ, వ్యవసాయ, సహకార శాఖాధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన కల్లాలలో తడిసిపోయిన ధాన్యాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన రైతులతో మాట్లాడుతూ వరి కోతలు, ధాన్యం కొనుగోలు కేంద్రాలు, అకాల వర్షాల వల్ల జరిగిన నష్టం గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. రైతులు ఆందోళన చెందవద్దని ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని వారికి భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన అకాల వర్షాల గురించి, కల్లాలలో తడిసిపోయిన ధాన్యం గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ చైర్మన్ తోట సుధీర్ , కుడా చైర్మన్ తుమ్మల బాబు, పౌరసరఫరాల సంస్థ మేనేజర్ ఎం నాయక్,వ్యవసాయశాఖ జే డి ఎన్ విజయ్‌కుమార్,పలువురు అధికారులు,ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## 'అందాల పోటీలపై ఉన్న శ్రద్ధ.. రైతులపై లేదు'..

### సిఎం రేవంత్ పై హరీష్ రావు ఫైర్



**హైదరాబాద్, :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి హరీశ్ రావు మరోసారి ఫైరయ్యారు. ఓ పక్క వడ్లు అమ్మేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే.. సిఎం రేవంత్ మాత్రం అందాల పోటీలపై దృష్టి పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు హరీష్ రావు మీడియాతో మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి అందాల పోటీ పట్ల ఉన్న శ్రద్ధ రైతుల పట్ల లేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం.. రైతులను గాలికి వదిలేసిందని మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా మార్కెట్ యార్డుల్లో ధాన్యం కొనుగోలు కోసం పడిగాపులు కాస్తూ ఇప్పటికే ఐదుగురు రైతులు ప్రాణాలు కోల్పోయారని.. ఇవి సహజ మరణాలు కాదని.. ముమ్మాటికి కాంగ్రెస్ ప్రభుత్వ హత్యలేనని దుయ్యబట్టారు. పత్తి కొనుగోళ్లలో సీసీఐ అధికారులు రూ.3 వేల కోట్ల అవినీతికి పాల్పడ్డారని హరీష్ రావు ఆరోపించారు. కేవలం 20 శాతం పత్తి రైతులకు మాత్రమే మద్దతు ధర లభించిందని, 80 శాతం పత్తిని బ్రోకర్లు రైతుల దగ్గర తక్కువ ధరకు కొని సీసీఐకు ఎక్కువ ధరకు అమ్ముకున్నారని అన్నారు. సీసీఐ అధికారుల పట్ల వెంటనే సిబిఐ దర్యాప్తు చేయాలని హరీష్ రావు డిమాండ్ చేశారు.

## తెలంగాణకు కేంద్రం ఎన్నో ప్రాజెక్టులు కేటాయించింది



హైదరాబాద్: కుమురం భీం అసిఫాబాద్ జిల్లాలో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ పర్యటించారు. కొత్త వంతెనల నిర్మాణం, రహదారుల విస్తరణకు శంకుస్థాపన చేశారు. రూ.3,900 కోట్ల విలువైన పనులను ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సభావేదికపై నుంచి 7 జాతీయ రహదారులను నితిన్ గడ్కరీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సీతక్క, ఎంపిలు నగేశ్, వంశీ, ఎమ్మెల్యేలు కోవా లక్ష్మి హెడ్మా బొజ్జు, తదితరులు పాల్గొన్నారు. ఈ సభా సమావేశంలో కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. కశ్మీర్ కు రైల్వే లైన్లు తెచ్చిన ఘనత ప్రధానమంత్రి నరేంద్ర మోడీదేనని ప్రశంసించారు. తెలంగాణలోని 32 జిల్లాలను జాతీయ రహదారులతో అనుసంధానం చేశారని అన్నారు. తెలంగాణకు కేంద్రం ఎన్నో ప్రాజెక్టులు కేటాయించిందని చెప్పారు. హైవేల విస్తరణ వల్ల రోడ్డు ప్రమాదాలు తగ్గాయని, సమయం తగ్గిందని తెలిపారు. రోడ్డు, రైల్వే, విమాన కనెక్టివిటీ పెంచేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. హైవేల విస్తీర్ణం 5 వేల కిలోమీటర్లు దాటిందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణలో హైవేల నిర్మాణ పనులకు.. కేంద్రం రూ.1.25 లక్షల కోట్లు కేటాయించిందని కేంద్రమంత్రి బండి సంజయ్ తెలిపారు. ఎన్నికల సమయంలోనే రాజకీయాలు..అభివృద్ధి విషయంలో కాదని అన్నారు. ఈ సభా సమావేశంలో బండి మాట్లాడారు. రాష్ట్రాల అభివృద్ధితోనే దేశం అభివృద్ధని మోడీ నమ్ముతారని చెప్పారు. గత పదేళ్లలో తెలంగాణలో హైవేల విస్తీర్ణం 5,100 కి.మీ.కు చేరుకుందని, తెలంగాణలో హైవేల నిర్మాణ పనులకు..కేంద్రం రూ. 1.25 లక్షల కోట్లు కేటాయించిందని బండి సంజయ్ తెలియజేశారు.

### డాల్ఫిన్‌ల శబ్దాలకు అర్థాలు వెతుకుతున్న గూగుల్!


### స్వరాలు, ప్రవర్తనల డేటా సేకరణకు 'డాల్ఫిన్ జెమ్మా'

### డాల్ఫిన్‌లతో మాటామాటా కలిపిన ఏఐ మోడల్

### మిగతా జీవులపైనా జరుగుతున్న ఏఐ అధ్యయనాలు

### పరిశోధనలు ఫలిస్తే మూగజీవాలకు 'మాటలొచ్చినట్లే'!

## డాల్ఫిన్లు ఏమంటున్నాయి?




డాల్ఫిన్లు వివిధ రకాలైన వింత శబ్దాలను చేస్తాయి. జంతువుల్లా అరుస్తాయి. పక్షుల్లా కూస్తాయి. మనుషుల్లా మూలుగుతాయి. ఈలలు వేస్తాయి. కిచకిచమంటాయి. పకపకమంటాయి. పెద్ద బుడగ పగిలినట్లుగా ధడేల్మంటాయి. అవి ఉన్న పరిస్థితిని బట్టి, తమ ప్రవృత్తిని, ప్రకోపాన్ని అనుసరించి విభిన్నమైన ధ్వనులతో తమలో తాము సంభాషించుకుంటాయి! ఆ సంభాషణలకు, లేదా వాటి ధ్వనులకు అర్థం ఏమై ఉంటుంది? అది తెలుసుకోటానికే... 'డాల్ఫిన్ జెమ్మా' అనే డాల్ఫిన్ ఏఐ మోడల్‌ను (సాఫ్ట్‌వేర్‌ను) భుజాన వేసుకుని 'గూగుల్' సముద్ర పరిశోధనలు చేస్తోంది! డాల్ఫిన్‌లతో మాటలు కలపటానికి వాటి అరుపులను అనుకరిస్తోంది. ఆ అరుపుల అర్థాలను డీకోడ్ చేయవచ్చని భావిస్తోంది. అయితే, ఏఐ సహాయంతో మనిషి ఏనాటికైనా మానవేతర జీవుల మనసును పసిగట్టగలడా? కృత్రిమ మేధ, మానవ అంతర్దృష్టిని దాటి లోలోపలికి చూడగలదా అన్నదే పెద్ద ప్రశ్న.

### ఏమిటీ 'డాల్ఫిన్ ఏఐ మోడల్'

డాల్ఫిన్లు కూడా మనుషుల్లాగే సామాజిక నైపుణ్యం కలిగినవి. చెప్పాలంటే తెలివైనవి, చురుకైనవి కూడా. మచ్చికైన మనుషులతో భావోద్వేగాలను కూడా పంచుకుంటాయి! అలాగే ఇతర జంతువులు కూడా. బ్రిటిష్ మహిళా ఎథాలజిస్ట్ (మానవేతర జంతు ప్రవర్తనల అధ్యయన శాస్త్రవేత్త) జేన్ గుడాల్ అడవి చింపాంజీల సామాజిక కుటుంబ పరస్పర పరిశోధనలను చేసిన విధంగానే, ప్రముఖ మహిళా పరిశోధకురాలు డెనిస్ హెర్జింగ్ 1985 నుండే డాల్ఫిన్ కమ్యూనికేషన్ మీద అధ్యయనం చేస్తున్నారు. 'ది వైల్డ్ డాల్ఫిన్ ప్రాజెక్ట్' (డబ్ల్యు.డి.పి.) అనే ప్రతిష్టాత్మకమైన భారీ సముద్ర గర్భ ప్రాజెక్టులో తలమునకలై ఉన్నారు. గూగుల్ ఇప్పుడు ఆ డబ్ల్యు.డి.పి. ప్రాజెక్టుతో, జార్జియా టెక్ యూనివర్సిటీతో కలిసి డాల్ఫిన్‌ల స్వర నమూనాలను విశ్లేషించడానికి, వాటి నిర్మాణాన్ని గుర్తించడానికి తొలిసారి 'డాల్ఫిన్ ఏఐ మోడల్'తో ప్రయోగాలు తలపెట్టింది.

### ఇది ఎలా పని చేస్తుందంటే..

డాల్ఫిన్లు భిన్న సామాజిక, పరిసర పరిస్థితులకు భిన్న శబ్దాలను చేస్తాయి. ముఖ్యంగా తల్లులు, పిల్లల మధ్య వ్యక్తిగత గుర్తింపు కోసం ఈలలు వేస్తాయి. ఘర్షణ పడుతున్నప్పుడు 'క్కే క్కే' మంటాయి. ప్రేమలో ఉన్నప్పుడు / సహజీవనం చేస్తున్నప్పుడు చేగోడీలు కొరికితే వచ్చే చప్పుడును చేస్తాయి. ఈ శబ్దాలను విని ఫీడ్ చేసుకునేందుకు, ప్రతిస్పందన శబ్దాలు చేసేందుకు పిక్సెల్ 6 స్మార్ట్‌ఫోన్ లపై పనిచేసే 'డాల్ఫిన్ జెమ్మా'ను గూగుల్.. బహమాస్ ద్వీపంలో కలియ తిప్పుతోంది. డబ్ల్యు.డి.పి. నుంచి వచ్చిన డేటాతో ఆడియో సాంకేతికతను మిళితం చేయటం ద్వారా గూగుల్ డాల్ఫిన్ ఏఐ మోడల్.. జల గర్భంలోని డాల్ఫిన్‌ల శబ్దాలను డీకోడ్ చేస్తుంది. ఏప్రిల్ 14న 'జాతీయ డాల్ఫిన్ దినోత్సవం' నాడు, గూగుల్ తన డాల్ఫిన్ ఏఐ నమూనా పురోగతిని ప్రదర్శించింది. ఫలితం ఏంటంటే - అది ఎంతో చక్కగా డాల్ఫిన్ స్వర నమూనాలను విశ్లేషిస్తోంది. నిజమైన డాల్ఫిన్ లాంటి శబ్దాలను సైతం తనే ఉత్పత్తి చేస్తోంది.

### ఏఐ ప్రయోగం.. ఏమిటి ప్రయోజనం?

అంతరించిపోతున్న జీవ జాతులను పర్యవేక్షించడం ద్వారా వాటి పరిరక్షణకు ఏఐ మోడల్ సహాయపడుతుంది. ఇక డీకోడింగ్ కమ్యూనికేషన్ అన్నది జీవజాతుల పర్యావరణ వ్యవస్థ ఆరోగ్యాన్ని వెల్లడిస్తుంది. కాలుష్యం, వాతావరణ మార్పుల గురించి మానవుల్ని హెచ్చరిస్తుంది. ఏఐ మానవులు - మూగ జీవుల మధ్య పరస్పర సాహచర్యాన్ని పెంచుతుంది, సహానుభూతిని పెంపొందిస్తుంది.

### అన్ని జంతువులపైనా ఏఐ పరిశోధనలు

చిలుకలు, కాకులు, తోడేళ్లు, తిమింగలాలు, చింపాంజీలు, ఆక్టోపస్‌లు ఎలా సంభాషిస్తాయో గుర్తించడానికి కూడా ఇప్పుడు ఏఐ ఉపయోగపడుతోంది. 'నేచురల్ ఎల్.ఎం. ఆడియో' అనేది జంతువుల శబ్దాల కోసం నిర్మించిన మొట్టమొదటి ఆడియో-భాషా నమూనా. దీని ద్వారా ఇంతవరకు కనిపించని జాతుల శబ్దాలను సైతం విశ్లేషించవచ్చు. మరికొన్ని ప్రాజెక్టుల ద్వారా స్పెర్మ్ వేల్ వెలువరించే ధ్వనుల అర్థాలను కనిపెట్టటానికి ఏఐని, రోబోటిక్స్‌ను ఉపయోగిస్తున్నారు. అలాగే జంతువుల లైంగిక ప్రవర్తనలను అంచనా వేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఉపగ్రహ చిత్రాలు, కెమెరా ట్రాప్‌లు, బయో అకౌస్టిక్‌ల అనుసంధానం కలిగి ఉన్న ఏఐను పక్షుల సంరక్షణకు, పర్యవేక్షణకు, అమెజాన్ ప్రాంత రక్షణకు ఉపయోగిస్తున్నారు. కొలంబియాలోని యూనివర్సిడాడ్ డి లాస్ ఆండీస్, ఇన్ స్టిట్యూటో సించి, ఇన్ స్టిట్యూటో హంబోల్ట్, ప్లానెట్ ల్యాబ్స్, మైక్రోసాఫ్ట్ ఏఐ ఫర్ గుడ్ ల్యాబ్‌ల సహకారంతో ఈ ప్రాజెక్టు నడుస్తోంది.

### కృత్రిమ మేధకూ పరిమితులు

కృత్రిమ మేధ జంతువుల ధ్వని నమూనాలను గుర్తించగలదు, కానీ అనూహ్యంగా జరిగే జంతువుల అకాల సంభోగం, వేళకాని వేళ అవి ఆహారం తీసుకోవటం లేదా ఏదైనా ప్రమాదంలో అవి చేసే ధ్వనులను గుర్తించటంలో కృత్రిమ మేధకు పరిమితులు ఉంటాయి. జంతువులు మానవుల మాదిరిగానే 'మాట్లాడుకుంటాయి' అనేది పొరపాటు భావన అయినప్పుడు, క్షేత్రస్థాయి వివరాలు చిక్కుముడిగా లభ్యం అవుతున్నప్పుడు కూడా జీవజాతుల%-%నిర్దిష్ట ప్రవర్తనల విశ్లేషణ ఏఐకి క్లిష్టతరం అవుతుంది. చాలాసార్లు మానవ అంతర్దృష్టి జోడింపు అవసరం కావచ్చు. పైగా ఇలాంటి అధ్యయనాలకు తరచుగా కస్టమ్ మోడళ్లు, విస్తృతమైన వనరులు అవసరమవుతాయి. దాంతో జంతువుల కమ్యూనికేషన్ అన్నది డీకోడింగ్‌ను సంక్లిష్టమైన ప్రయత్నంగా మారుస్తుంది.

## అత్యంత దుస్థితిలో పాక్ మందుగుండుకూ దిక్కు లేదు

## కేవలం 4 రోజుల్లో చేతులెత్తేయడమే!



పహల్గాం ఉగ్రదాడిపై భారత్ ప్రతీకార చర్యలతో పాకిస్తాన్ ఉక్కిరిబిక్కిరవుతోంది. ఏ క్షణాన ఎలా విరుచుకుపడుతుందోనని బిక్కుబిక్కుమంటోంది. దీటైన ప్రతిస్పందన, అవసరమైతే అణుబాంబులు అంటూ పైకి మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నా లోలోపల మాత్రం వణికిపోతోంది. భారత్‌ను ఎలాగోలా నిలువరించండంటూ అరబ్ దేశాలను బామాలుతోంది. ఇందుకు కారణాలు లేకపోలేదు. పాక్ సాయుధ సన్నద్ధత, ఆయుధ సంపత్తి అత్యంత దారుణంగా ఉన్నట్టు అక్కడి మీడియానే చెబుతోంది. ఇప్పటికిప్పుడు భారత్‌తో యుద్ధానికి తలపడాల్సి వస్తే పాక్ కేవలం నాలుగు రోజులు మాత్రమే ఎంతో కొంత పోరాడగలదని, తర్వాత చేతులెత్తేయడం మినహా మరో మార్గం లేదని తెలుస్తోంది.

### నిండుకున్న మందుగుండు

భూతల యుద్ధంలో కీలకమైన శతఘ్నులు, మోర్టార్లు, తుపాకుల్లో వాడే అన్నిరకాల మందుగుండూ పాక్ వద్ద దాదాపు ఖాళీ అయినట్టు తెలుస్తోంది. సైన్యం వద్ద కేవలం నాలుగు రోజులకు సరిపడే నిల్వలు మాత్రమే ఉన్నాయి. పాక్‌కు ప్రధానంగా మందుగుండు సరఫరా చేసే సంస్థలు ఇప్పుడు గాజా, ఇజ్రాయెల్ యుద్ధం, ఉక్రెయిన్ యుద్ధాలకు మందుగుండు సరఫరాలో బిజీగా ఉన్నాయి. దాంతో పాక్ అవసరాలను తీర్చే నాథుడే లేకుండా పోయాడు. అంతర్జాతీయంగా మందుగుండుకు ఇప్పుడున్న డిమాండ్ నేపథ్యంలో వాటిని కొనే స్తోమత, ఆర్థిక బలం కూడా పాక్‌కు లేవు. దీనికితోడు దేశీయంగా మందుగుండు, ఆయుధాలను తయారు చేసే పాక్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ తీవ్ర ముడిసరుకుల కొరతను ఎదుర్కొంటోంది. పైగా దాని సాంకేతికత పాత తరానిది కావడంతో పెద్దగా పనికొచ్చే పరిస్థితి కూడా లేదు. ఉక్రెయిన్‌తో గత ఒప్పందం మేరకు ఆ దేశానికి పాక్ ఇటీవలి దాకా భారీగా మందుగుండు సరఫరా చేసింది. తీరా ఇప్పుడు సొంత అవసరాలకు సరిపడా నిల్వల్లేక తెగ తిప్పలు పడుతోంది. యుద్ధమే వస్తే ప్రస్తుత మందుగుండు నిల్వలు 96 గంటల్లోపే ఖాళీ అవుతాయని పాక్‌లోని విశ్వసనీయ సైనిక వర్గాలు వెల్లడించాయి.

### హొవిట్జర్లకూ మందుగుండు కొరతే

పాక్ ఎం109 హొవిట్జర్లలో ఉపయోగించే 155 ఎంఎం షెల్స్, బీఎం -21 మల్టిపుల్ రాకెట్ లాంచింగ్ వాహనాల్లో వాడే 122 ఎంఎం రాకెట్లకు కూడా తీవ్ర కొరత ఏర్పడింది. ఉక్రెయిన్ యుద్ధం మొదట్లో ఆ దేశానికి పాక్ 155 ఎంఎం షెల్ మందుగుండు ఎడాపెడా ఎగుమతి చేసింది. దాంతో వాటి నిల్వలు భారీగా తగ్గిపోయాయి. మౌంటెడ్ గన్ సిస్టమ్(ఎంజీఎస్) వ్యవస్థలో వాడే మందుగుండునూ ఉక్రెయిన్‌కు భారీగా ఇచ్చేసింది. అవీ తగ్గిపోవడంతో గాబరా పడుతోంది. ఈ పరిస్థితుల్లో భారత్ గనుక అధునాతన ఆయుధాలతో సరిహద్దు దాటి వస్తే నిలువరించేందుకు శతఘ్నులు మందుగుండుతో సిద్ధంగా లేవని మే 2న జరిగిన పాక్ స్పెషల్ కోర్ కమాండర్స్ భేటీలో సైన్యాధికారులు ఆందోళన వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది.

### కాలూచేయీ కూడదీసుకుంటూ...

అందుబాటులో ఉన్న కొద్దిపాటి మందుగుండును వీలైనంతగా భారత సరిహద్దులకు పాక్ తరలిస్తోంది. అక్కడ ఇప్పటికే మందుగుండు నిల్వ చేసి పెట్టుకుందని విశ్వసనీయ సమాచారం. మందుగుండు కొరతను గతంలో కూడా పాక్ ప్రభుత్వ వర్గాలే ఒప్పుకున్నాయి. యుద్ధం వస్తే ఎదుర్కోవడానికి సరిపడా ఆయుధాలు కూడా లేవని నాటి పాక్ ఆర్మీ చీఫ్ ఖమర్ జావేద్ బజ్వా వాపోయారు. దీర్ఘకాలం పాటు యుద్ధం చేయడం పాక్ దళాలకు అసాధ్యమని కుండబద్దలు కొట్టారు. గగనతలంలో యుద్ధ విమానాలు, డ్రోన్లతో ఎంతగా పోరాడినా భూభాగాన్ని కాపాడుకోవడమే యుద్ధాల్లో కీలకం. కానీ నేవీ, ఎయిర్‌ఫోర్స్‌తో పోలిస్తే పాక్ ఆర్మీ పాటవం, సన్నద్ధత అత్యంత అధ్వానమని తెలుస్తోంది.

## ఉమ్మడి చితిపేర్పు




'యుద్ధం' రెండక్షరాల మాటే, 'శాంతి' కూడా అంతే! విచిత్రంగా, చావుబతుకులు రెంటినీ ఇముడ్చుకున్నవి కూడా ఆ రెండేబీ జీవన ప్రవాహానికి రెండు వైపులా కాపుకాసే తీరాలూ, మనిషిని ఇరువైపులా మోహరించిన భిన్న ధ్రువాలూ అవేబీ వాటి మధ్యనే మానవ సంచారం. లియో తొలు స్తాయ్ 'వార్ అండ్ పీస్' పేరుతో, నిర్దిష్ట స్థలకాలాల నేపథ్యంతో రచించిన ఐతిహాసిక నవలలో మార్చి మార్చి జరిగే ఆ సంచారాన్ని అత్యద్భుతంగా, ఆర్ద్రంగా కళ్ళకు కట్టిస్తాడు. యుద్ధమూ, శాంతీ మనిషితోనే పుట్టి ఉంటాయి. బహుశా మనిషి తొలి యుద్ధం సాటిమనిషితో కాదు, ప్రకృతి శక్తులతో! అది బతకడానికి మొదలైన యుద్ధంబీ మనుషులొకరి నొకరు చంపుకునే యుద్ధం ఆ తర్వాత వచ్చిందిబీ నాగరికత ముదిరినకొద్దీ అది మహాయుద్ధాల స్థాయికి చేరింది. శాంతి అన్నది యుద్ధమనే రెండు క్రూర సింహాల మధ్య ఇరుక్కున్న బెదురుచూపుల లేడికూనా, మండు టెడారిలో అక్కడక్కడ మరులుగొలిపే శీతలజలచ్ఛాయా అయింది. మనిషి ఒంటిగా ఉన్నప్పుడు బతకనిచ్చే, బతుకునిచ్చే శాంతినే కోరుకుంటాడుబీ పదిమందిలో ఒకడైనప్పుడే యుద్ధపిపాసి అవుతాడు.

ఈ చంచలత్వం మనిషి స్వభావంలోనే ఉంది. తన శాంతి యుత అస్తిత్వానికే చేటు వచ్చినప్పుడు చావో, రేవో తేల్చుకోవాలనుకోవడం సహేతుకమేబీ కానీ ఏదో ఒక విస్తరణ దాహంతో రక్తపుటేరులు పారించడంలోనే ఎక్కువ చరిత్ర మూటగట్టుకున్నాడు. తన లక్షల సంవత్సరాల మనుగడలో శాంతియుత సహజీవనంపై ఇంతవరకు ఏకీభావానికి రాలేక పోయాడు. అతని అనేకానేక విజయాలను నిలువునా వెక్కిరించే మహా వైఫల్యం అదే. ప్రకృతి ప్రణాళికలో లేని బలవంతపు చావును కొని తెచ్చుకునే వికటించిన తెలివి మనిషిది. ప్రపంచ సాహిత్యంలోని అనేక శిఖరాయమాన రచనల్లో యుద్ధమే ఇతివృత్తం. దేశ కాలాలు, భాషా సంస్కృతులు వేరైనా అవి ఒక్కలానే యుద్ధభాష మాట్లాడాయి, యుద్ధ సంస్కృతిని చిత్రించాయిబీ యుద్ధం తెచ్చిపెట్టే అపార విధ్వంసంపై, సృష్టించే దుఃఖసముద్రాలపై ఒక్క గుండెతోనే స్పందించాయి. యుద్ధాలను గర్హించే పాత్రలకూ, ఆకాశానికెత్తే పాత్రలకూ కూడా ఒకే గౌరవాన్ని కట్టబెట్టాయి. యుద్ధాలు తగవంటూనే పోరాడి ప్రాణాలు బలిపెట్టిన వీరులకు హారతి పట్టాయి. మహాభారతాన్నే తీసుకుంటే, యుద్ధం వద్దన్నవారు కూడా యుద్ధంలోకి దిగిపోయినప్పుడు, విదురుడొక్కడే ఒంటరిగా ఒడ్డున మిగిలిపోతాడు. అంతవరకు కురుపాండవులుభయుల శ్రేయస్సునూ కోరుకున్న భీష్మ పితామహుడు యుద్ధంలో పాండవ పక్షాన్ని నిర్దాక్షిణ్యంగా నరికి పోగులుపెడతాడు. చస్తే యుద్ధంలోనే చావాలి, ఇంట్లో రోగమొచ్చి చావడం కన్నా పాపమేదీ ఉండదని ఉద్బోధిస్తాడు. అర్జునుడు తనను చంపుతానని ప్రతిజ్ఞ చేసినప్పుడు ప్రాణభయంతో వచ్చి తనను కలిసిన సైంధ వునితో ఆచార్య ద్రోణుడూ అదే అంటాడుబీ 'మృత్యువుకెందుకు భయపడుతున్నావు, వెళ్ళి యుద్ధం చేయి, ఎవరూ భూమ్మీద శాశ్వతం కాదు, అందరూ పోయేవాళ్ళే'నంటాడు. 'వార్ అండ్ పీస్'లో మరియా దిమిత్రెవ్నా అనే పాత్ర, తన కొడుకులు నలుగురు సైన్యంలో ఉన్నారనీ, అయినా తనకు చింత లేదనీ, చావనేది ఇంట్లో పడుకుని ఉన్నా వస్తుందనీ సగర్వంగా అంటుంది. యుద్ధానికి ఎందుకు సిద్ధమవుతున్నావని పియర్ అనే పాత్ర తన మిత్రుడు ప్రిన్స్ ఆంద్రైని అడిగినప్పుడు, 'ఏమో, ఎందుకో నాకే తెలియదు, ఇప్పుడు జీవిస్తున్న జీవితం నాకు నచ్చడంలే'దని అతనంటాడు. హోమర్ కృతి 'ఇలియడ్'లో ట్రాయ్ రాకుమారుడు హెక్టర్, అర్జునుడిలానే యుద్ధాన్ని ద్వేషిస్తాడు, తన భార్య శత్రువుకి బానిసగా చిక్కి ఊడిగం చేసే దృశ్యాన్ని ఊహించుకుని కుంగిపోతాడు, అయినా సరే యుద్ధం చేసి అఖిలీస్ చేతిలో మరణిస్తాడు. అఖిలీస్ చంపడంలోనే వెర్రి ఆనందాన్ని అనుభ విస్తాడు, అదే ఉత్తమోత్తమ పుణ్యకార్యమనుకుంటాడు, ఆ రోజుకి యుద్ధమైపోయాక మళ్ళీ మనిషై పోతాడు. తను రథానికి కట్టి ఈడ్చుకొచ్చిన హెక్టర్ మృతదేహాన్ని యాచించడానికి అతని తండ్రి ప్రియామ్ వచ్చినప్పుడు, అతణ్ణి సగౌరవంగా ఆహ్వానించి శవాన్ని అప్పగించి పంపిస్తాడు. యుద్ధవ్యతిరేకతా, యుద్ధప్రియత్వాల మధ్యబీ మానుష, అమానుషత్వాల మధ్య మనిషి ఊగిసలాట ఆశ్చర్యం గొలుపుతుందిబీ క్షతగాత్రుడై పడున్న శత్రువీరుడు ఆంద్రైని చూసి నెపోలియన్ గుండె కరుగుతుంది. తన చేతిలో మరణించిన వాలిపై పడి తారా, రావణునిపై పడి మండోదరీ హృదయ విదారకంగా రోదిస్తున్నప్పుడు రాముడు మ్రాన్పడి ఉండిపోతాడు. ఏ యుద్ధంలోనైనా విజేతలు, పరాజితులన్న తేడా కేవలం సాంకేతికమేబీ అంతిమ విజయం మృత్యు, విధ్వంసాలదే! విజేత పక్షానికి చెందిన గర్భవతి ఉత్తర, భర్త అభిమన్యుని మరణానికి కన్నీరుమున్నీరవుతుంది. ఉప పాండవులను పోగొట్టుకున్న ద్రౌపది కడుపుకోతా, నూరుగురు కొడుకులను కోల్పోయిన గాంధారి గర్భశోకమూ ఒక్కటే అవుతాయి. నివాసాలు శ్మశానాలవుతాయి, ఊళ్ళు కాలిబూడిదవుతాయి,కొంపలు కొల్లేరవుతాయి, ఖజానాలు ఖాళీ అవుతాయి, శవాల గుట్టల మధ్య బతికున్నవాళ్లు జీవచ్ఛవాలవుతారు. గాంధారి శోకం శాపమై యదువంశాన్ని పట్టి కుదుపుతుంది, యుద్ధం ఇంకో యుద్ధానికే బీజావాపమవుతుంది, విధ్వంసం మరో విధ్వంసానికే దారి తీయిస్తుంది. శాంతి, రెండు యుద్ధాల మధ్య విరామ చిహ్నమవుతుంది. ఎంతో ఎదిగామనుకునే ఈ రోజున కూడా యుద్ధానికీ, శాంతికీ మధ్య ద్వైదీభావాన్ని మనిషి జయించలేకపోతున్నాడుబీ ఉండి ఉండి యుద్ధోన్మాది అవుతూనే ఉన్నాడు, భేరీలు మోగిస్తున్నాడు, నినాదాలు ఎలుగెత్తుతున్నాడు! ఇందుకు ఏ ఒక్కరో బాధ్యులు కారు, ఇది సమష్టి వైఫల్యం, ఉమ్మడి చితిపేర్పు.

# పోచంపల్లిని సందర్శించనున్న మిస్ వరల్డ్ 2025 పోటీదారులు..!





**హైదరాబాద్, :** హైదరాబాద్ వేదికగా మిస్ వరల్డ్ 2025 పోటీలు జరగబోతున్న సంగతి తెలిసిందే. అయితే ఒక ఉత్సాహభరితమైన సాంస్కృతిక ప్రదర్శనలో భాగస్వాములు అవుతున్న మిస్ వరల్డ్ - 2025 గ్రూప్ -2 పోటీదారులు మే 15న ప్రపంచ ప్రఖ్యాత చేనేత గ్రామం పోచంపల్లిని సందర్శించనున్నట్లు ఐ-పిఆర్ విభాగం అధికారులు తెలిపారు. ఈ ప్రత్యేక కార్యక్రమం భారతదేశంలోని అత్యంత ప్రసిద్ధ వస్త్ర సంప్రదాయాలలో ఒకటైన పోచంపల్లి ఇక్కత్ పై ప్రపంచ దృష్టిని ఆకర్షించనుంది. తెలంగాణలోని యాదాద్రి భువనగిరి జిల్లాలో ఉన్న పోచంపల్లి, దాని సంక్లిష్టమైన ఇక్కత్ నేత పద్ధతులకు అంతర్జాతీయంగా ప్రశంసలు అందుకుంది. పోచంపల్లిని యునెస్కో "ప్రపంచంలోని ఉత్తమ పర్యాటక గ్రామం"గా గుర్తించింది. ఇది చేతిపనులు, సంస్కృతి, వారసత్వానికి సజీవ మ్యూజియం. మిస్ వరల్డ్ పోటీదారులు ఇక్కత్ సాంప్రదాయ టై-అండ్-డై ప్రక్రియను అనుభవిస్తారు. నిష్ణాతులైన నేత కార్మికులతో సంభాషిస్తారు. అలాగే హైదరాబాద్ నిజాంలు ఒకప్పుడు అభిమానించిన డబుల్ ఇకాట్ కళాఖండం అయిన ఐకానిక్ టెలియా రుమల్ తయారీని చూస్తారు. ఆచార్య వినోబా భావే నేతృత్వంలోని భూదాన్ ఉద్యమంలో చారిత్రాత్మక పాత్ర పోషించిన ఈ గ్రామం వస్త్ర కళాత్మకత, సామాజిక-సాంస్కృతిక వారసత్వం అరుదైన మిశ్రమాన్ని అందిస్తుంది. మిస్ వరల్డ్ వేదిక అపూర్వమైన అంతర్జాతీయ దృశ్యమానతను అందిస్తున్నందున, ఈ ప్రతిష్టాత్మక సందర్శన తెలంగాణ రాష్ట్ర గొప్ప చేనేత వారసత్వాన్ని ప్రపంచ పటంలో ఉంచుతుంది. పోచంపల్లి శక్తివంతమైన నేత, గ్రామీణ హస్తకళ ఇంకా సాంస్కృతిక లోతును ప్రదర్శించడం ద్వారా, ఈ కార్యక్రమం ప్రపంచవ్యాప్తంగా ఉన్న చేనేత అభిమానులకు భారతదేశ జీవన సంప్రదాయాల శక్తివంతమైన వేడుకగా మారుతుంది. ఈ నెల చివర్లో హైదరాబాద్‌లో జరిగే మిస్ వరల్డ్ గ్రాండ్ ఫినాలే కోసం అంచనాలు పెరుగుతున్న కొద్దీ, పోచంపల్లి సందర్శన ఒక హైలైట్‌గా ఉండనుంది. దీనితో చేనేత వారసత్వాన్ని, మగ్గం తెలంగాణ కథను ప్రపంచానికి తెలియజేస్తుంది.

## మే 15కి వాయిదా.. జస్టిస్ గవై ధర్మాసనం ఎదుట జాబితా




న్యూఢిల్లీ : వక్ఫ్ సవరణ చట్టాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌లను మే 15న తదుపరి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ)గా బాధ్యతలు చేపట్టనున్న జస్టిస్ బి.ఆర్.గవై ధర్మాసనానికి సుప్రీంకోర్టు బదిలీ చేసింది. వక్ఫ్ సవరణ చట్టంపై పిల్‌లన్నింటినీ జస్టిస్ బి.ఆర్.గవై నేతృత్వంలోని ధర్మాసనానికి జాబితా చేయనున్నట్లు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) జస్టిస్ సంజీవ్ ఖన్నా సోమవారం పేర్కొన్నారు. జస్టిస్ సంజీవ్‌ఖన్నా మే 13న సిజెఐగా పదవీ విరమణచేయనున్నారు. ఈ అంశంపై వివరణాత్మక పరిశీలన అవసరమైనందున ఈ దశలో తాను ఎటువంటి తీర్పు లేదా ఉత్తర్వులు రిజర్వ్ చేయాల్సిన అవసరం లేదని విచారణ సందర్భంగా ఆయన వ్యాఖ్యానించారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు జస్టిస్ గవైకి కొంత సమయం ఇవ్వాలని, మే 15కు వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. మే 5 వరకు వక్ఫ్ ఆస్తులను డీనోటిఫై చేయబోమని, సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్ మరియు బోర్డులో ఎలాంటి నియామకాలు చేయబోమని జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనానికి కేంద్రం తెలిపింది.

## గాజాపై దాడుల విస్తరణకు ఇజ్రాయిల్ కేబినెట్ ఆమోదం



జెరూసలెం : గాజాపై దాడులను విస్తరించేందుకు ఇజ్రాయిల్ కేబినెట్ ఆమోదం తెలిపింది. గాజాలో హమాస్‌పై దాడిని క్రమంగా విస్తరించేందుకు ప్రధాని నెతన్యాహూ భద్రతా వ్యవహారాల కేబినెట్ ఆమోదం తెలిపిందని సంబంధిత వివరాల గురించి తెలిసిన వర్గాలను ఉటంకిస్తూ ఇజ్రాయిల్ మీడియా సోమవారం వెల్లడించింది. గాజాలో సాయం అందించేందుకు కొత్త ప్రణాళికను కేబినెట్ ఆమోదించిందని తెలిపింది. అయితే సాయాన్ని ఎప్పుడు అనుమతిస్తారు అనే అంశంపై స్పష్టత లేదు. ఇప్పటికే భద్రతా దళాలను పెంచేందుకు చర్యలు చేపట్టినట్లు ఆర్మీ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ ఐయాల్ జమీర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సైన్యంలో చేరాల్సిందిగా పది నుండి వేలకు పైగా పౌరులకు ఆదేశాలను పంపామని అన్నారు. తమ బందీలను వెనక్కి రప్పించడం, హమాస్‌ను ఓడించడం లక్ష్యంగా ఒత్తిడిని మరింత పెంచుతున్నామని జమీర్ దళాలకు చెప్పినట్లు సైన్యం ఆ ప్రకటనలో తెలిపింది. ఇజ్రాయిల్‌లోని ప్రధాన విమానాశ్రయం టెల్‌అవీవ్‌లోని బెన్ గురియన్ అంతర్జాతీయ విమానాశ్రయంపపై ఆదివారం ఉదయం యెమెన్‌లోని హౌతీ తిరుగుబాటుదారులు క్షిపణి దాడి జరిపిన అనంతరం ఇజ్రాయిల్ కేబినెట్ సమావేశమైన సంగతి తెలిసిందే.

## కాన్పూర్‌లో భారీ అగ్నిప్రమాదం.. ఐదుగురు మృతి



లక్నో : ఉత్తరప్రదేశ్ కాన్పూర్ చమన్ గంజ్ ప్రాంతంలోని ఆరు అంతస్తుల భవనంలో అగ్నిప్రమాదం జరిగింది. ఆదివారం రాత్రి జరిగిన ఈ ప్రమాదం వల్ల ఐదుగురు మృతి చెందినట్లు పోలీసులు సోమవారం తెలిపారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. ఈ బహుళ అంతస్తుల భవనంలో మొదటి అంతస్తులో ఫుట్‌వేర్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ ఉన్నది. బహుశా దీనివల్ల షార్ట్‌సర్క్యూట్ జరిగి భవనంలో మంటలు చెలరేగి ఉండవచ్చని, ఆ మంటలు పై అంతస్తుల్లో నివశిస్తున్న కుటుంబ సభ్యుల్ని సజీవదహనం చేసి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ మంటల్లో మృతి చెందినది డానిష్ కుటుంబంగా పోలీసులు గుర్తించారు. ఈ ప్రమాదంలో డానిష్‌తోపాటు అతని భార్య నజ్మీ సాబా, ముగ్గురు పిల్లలు మృతి చెందారు. ఈ ప్రమాదం జరిగిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. 12 ఫైరింజన్లతో మంటలను అదుపులోకి తెచ్చారు. మృతదేహాలను రెస్క్యూ సిబ్బంది వెలికితీశారు. ఈ ఘటనపై దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు.

# ఆంధ్రప్రదేశ్ రాజధానిని ఇకపై మార్చలేరా?

## ప్రభుత్వం ఏం చేయబోతుంది



అమరావతి స్వప్నం సాకారం అవుతున్నట్లు కనిపిస్తోందని.. చారిత్రక పరంపర, ప్రగతి రెండు కలిసి పయనిస్తున్నట్లు కనిపిస్తుందని శుక్రవారం రాజధాని అమరావతి పునర్నిర్మాణ పనులను ప్రారంభించిన సందర్భంగా వ్యాఖ్యానించారు. అమరావతిలో 18 ప్రాజెక్టులకు ఆయన శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..'తల్లి దుర్గ భవానీ కొలువైన పుణ్య భూమిపై మీ అందరినీ కలవడం నాకు ఆనందంగా ఉంది' అని అన్నారు. "అమరావతి ఒక నగరం కాదు.. అమరావతి ఒక శక్తి. దీనిని కేవలం ఒక నగరంగా కాకుండా నెరవేరిన కలగా చూస్తున్నానని మోడీ చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌ను ఆధునాతన ప్రదేశ్‌గా మార్చే శక్తి అమరా వతికి ఉంది. దాదాపు రూ.60 వేల కోట్ల విలువైన పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేశాం ఇవి కేవలం శంకుస్థాపనలు కాదు.. ఏపీ ప్రగతికి, వికసిత్ భారత్‌కు నిదర్శనాలు అని ఆయన వ్యాఖ్యానించారు.

### అమరావతి అగ్రగామి నగరం

అమరావతి యువత కలలు నెరవేరే నగరంగా మారనుంది. సమాచార సాంకేతికత, కృత్రిమ మేధస్సు, గ్రీన్ ఎనర్జీ, క్లీన్ ఇండస్ట్రీ, విద్య, ఆరోగ్య సంరక్షణ వంటి రంగాల్లో అమరావతి అగ్రగామి నగరంగా ఆవిర్భవిస్తుంది. ఇది స్వర్ణాంధ్రకు సంకేతం ప్రజా రాజధానికి పునర్వికాసం ఆ పేరు తలచుకుంటే చాలు ప్రజా జీవనంలోనూ, సాంస్కృతిక రంగంలోనూ, భారతీయ చరిత్రలోనే సర్వోత్కృష్టమైన ఒక మహాయుగం మన కనుల ముందు మెదులుతుంది.

### రెండోసారి శంకుస్థాపన పరిపాటేనా?

అమరావతికి పదేళ్ల క్రితమే ప్రధాని మోడీ అట్టహాసంగా శంకుస్థాపన చేసినప్పటికీ, అప్పటి ప్రభుత్వం భారీ ప్రాజెక్టులను చేపట్టడం, సకాలంలో పనులు ప్రారంభించలేకపోవడమో, ప్రభుత్వాలే మారి కొత్త ప్రభుత్వం ఆ ప్రాజెక్టును పక్కన పెట్టడమో .. ఇలా ఏదో ఒకటి జరగడం మామూలైపోయింది. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక మళ్లీ అమరావతిపై ఆశలు ఏర్ప డ్డాయి. అంచనాలు పెరిగి భారం మరింత పెరిగింది. అందుకే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేతుల మీదుగా అమరావతి నిర్మాణ పనులకు పునఃప్రారంభం అయ్యాయి. రాజధాని కొత్తగా రెక్కలు తొడిగే ఓ శుభ సందర్భం. ప్రభుత్వం అమరావతికి యాక్షన్ ప్లాన్‌ను తయారు చేసుకుంది. టెండర్ల ప్రక్రియను నిర్వహించి వాటిని ఖరారు చేసి గుత్తేదారులకు అనుమతులు జారీ చేశారు. టెండర్లు దక్కించుకున్న సంస్థలు చాలా వరకు పనుల ప్రారంభానికి సిద్ధమయ్యాయి.

### వెల్లువలా నిధులు..

రాజధాని నిర్మాణ పనులకు సంబంధించి ఇప్పటివరకు రూ.26 వేల కోట్ల మేర సమీకరించారు. ప్రపంచ బ్యాంకు నుంచి రూ.15 వేల కోట్లు రుణం మంజూరైంది. హడ్కో కూడా రూ.11 వేల కోట్లు ఇచ్చింది. నిధుల కోసం డొమెస్టిక్ అండ్ ఇంటర్నే షనల్ బాండ్ మార్కెట్ ద్వారా, మల్టీలేటరల్ ఏజెన్సీలు, బ్యాంకుల ద్వారా, కేంద్ర ప్రభుత్వ సాయం, పబ్లిక్ అండ్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ), భూ విక్రయాలు (ల్యాండ్ మానిటైజేషన్) వంటి మార్గాల ద్వారా సీఆర్‌డీఏ అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఆసియా అభివృద్ధి బ్యాంకు వంటి సంస్థల నుండి రాష్ట్రం గణనీయమైన ఆర్థిక సహాయాన్ని పొందినందున, అమరావతికి నిధుల కొరత లేదు.

### నవ నగరాల నిర్మాణానికి నాంది

నాలెడ్జ్ సిటీ, హెల్త్ సిటీ, స్పోర్ట్స్ సిటీ, ఎలక్ట్రానిక్స్ సిటీ, మీడియా సిటీ, ఫైనాన్స్ సిటీ, జస్టిస్ సిటీ, టూరిజం సిటీ వంటి తొమ్మిది నేపథ్య నగరాలను కలిగి ఉంటుంది. రతన్ టాటా ఇన్నో వేషన్ హబ్, ఇతర విద్యా సంస్థలు అత్యాధునిక రహదారులు ఎక్స్‌ప్రెస్‌వేలు, రైలు మార్గం ద్వారా అమరావతిని కృష్ణపట్నం, కాకినాడ విశాఖపట్నం వంటి ప్రధాన ఓడరేవులతో అనుసంధానించడం వల్ల, ఎగుమతులు, వ్యవసాయ-మార్కెట్ ఏకీకరణను పెంచుతాయి. అమరావతిని నాలెడ్జ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ హబ్‌గా రూపుదిద్దుకోవటానికి విధి విధానాలు రూపొందించ బడ్డాయి ఈ దిశగా పెట్టుబడులు కూడా రానున్నాయి సౌర శక్తితో వినియోగం సాంప్రదాయేతర ఇంధనాల వినియోగంతో, గ్రీన్ ఎనర్జీ హబ్‌గా మార్చాలనిది లక్ష్యం.

### రాజధానికి చట్టబద్ధత అవసరం

గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని అమరావతికి ఆంధ్రప్రదేశ్ రాజధానిగా చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ తెర మీదకు వచ్చింది. తాజాగా ముఖ్యమంత్రి చంద్రబాబు రాజధాని రైతులతో సమావేశం అయిన సందర్భంగా రైతులు ఇదే కోరిక కోరారు. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని కేంద్రం గుర్తించి, పార్లమెంట్‌లో చట్టం తీసుకువస్తే, ఇక రాజధానిని మార్చే వీలు కుదరదు. ఈ ఐదేళ్లలో అమరావతి నిర్మాణం పూర్తి కాకున్నా, వచ్చే ప్రభుత్వం కూడా పనులను కొనసాగిస్తుంది. రాజధాని భూములిచ్చిన రైతులకు, రాష్ట్ర ప్రజలందరికీ న్యాయం జరుగుతుంది. అందుకే చంద్రబాబు నాయుడు కూడా వీలైనంత త్వరలో అమరావతి రాజధానికి చట్టబద్ధత కల్పించడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

# యుద్ధం ప్రారంభించాలంటే ఈ వ్యూహం సిద్ధం చేసుకోవాల్సిందే!

ప్రపంచ చరిత్రను తిప్పి చూస్తే, యుద్ధాలు ఎన్నిసార్లు జయాలు అందించినా, వాటి దీర్ఘకాలిక ప్రభావాలే ఆ దేశాల భవిష్యత్‌ను రూపుదిద్దాయి. గెలిచిన దేశాలకూ, ఓడి పోయిన దేశాలకూ రెండింటికీ తగిన గుణ పాఠాలే ఎదురయ్యాయి. ఈ నేపథ్యంలో, భారత్ పాక్‌పై యుద్ధం ప్రారంభించాలంటే, తాత్కాలిక విజయానికి మాత్రమే కాదు.. భవిష్యత్ భద్రతా, ఆర్థిక, సామాజిక స్థిర త్వానికి కూడా దోహదపడేలా వ్యూహం సిద్ధం చేసు కోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. యుద్ధం ప్రారంభించే ముందు విజయం ఎలా కనిపించాలి, శాంతి ఎలా సాధించాలి అనే ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు సిద్ధం చేసుకున్నప్పుడు మాత్రమే, యుద్ధం విజయవంతం అవుతుంది. లేదంటే అది మరో అంతులేని సమస్యల చక్రవ్యూహంగా మారిపోతుంది. యుద్ధం తాత్కాలిక గర్వాన్నిచ్చి, దీర్ఘకాలికంగా దేశాన్ని క్షీణింపజేసే ప్రమాదం సైతం కూడా ఉంటుంది.



### యుద్ధం తాత్కాలిక గర్వాన్నిచ్చినా..

యుద్ధం అనేది ఒక చక్రం.. ప్రారంభించినప్పుడు మాత్రమే కాదు, దాన్ని ముగించి, విజయాన్ని సుస్థిరం చేయడం కూడా సమాన ప్రాధాన్యం గలది. భారత్‌కు పాక్‌పై యుద్ధం ప్రారంభించడం కేవలం ఆగ్రహానికి ప్రతిస్పందనగా మాత్రం కావొద్దు. అది ఒక జాతీయ భద్రతా వ్యూహం తుది దశ. అందుకే, ప్రతీ అడుగు, ప్రతీ నిర్ణయం, దీర్ఘకాలిక దృష్టితో, ప్రణాళిక బద్ధంగా తీసుకోవాలి. క్షణిక విజయాలు కాక, శాశ్వత స్థిరత లక్ష్యంగా ముందుకెళ్లాలి. యుద్ధం ప్రారంభించే ముందు విజయం, శాంతి ఎలా సాధించాలనే ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు సిద్ధం చేసుకున్నప్పుడు మాత్రమే, యుద్ధం విజయవంతం అవుతుంది. లేదంటే అది మరో అంతులేని సమస్యల చక్రవ్యూహంగా మారిపోతుంది.

### నిర్దిష్ట లక్ష్యం స్పష్టంగా లేకపోతే..

భారత్ ఎప్పటికీ ఆక్రమణ దురుద్దేశంతో కాక, అవసరమైన పక్షాన మాత్రమే శస్త్రాన్ని ఎత్తుకున్న దేశంగా పేరుగాంచింది. కానీ పాకిస్తాన్ మిలిటరీ తరచూ ఉగ్రవాదాన్ని ప్రేరేపిస్తూ, ఎక్కడో ఒకచోట సరిహద్దు ఉల్లంఘనలకు పాల్పడుతుంది. ఈ నేపథ్యంలో, భారత్‌కి తగిన ప్రతి చర్య తీసుకోవడం తప్పనిసరి అవుతుంది. ఈ దశలో యుద్ధం ప్రారంభించటమే సరైనదా కాదా? యుద్ధం ప్రారంభించిన తర్వాత మన లక్ష్యాలు ఏమిటి? దానికి మనం సిద్ధమా? అనే దానిపై స్పష్టత ఉండాలి. యుద్ధ ప్రారంభానికి ముందే కీలక వ్యూహాలు రచించుకోవాలి. యుద్ధం ఎందుకు చేస్తున్నామో స్పష్టంగా నిర్దిష్ట లక్ష్యంతో నిర్వచించాలి. ఆ నిర్దిష్ట లక్ష్యం స్పష్టంగా లేకపోతే, యుద్ధం అనవసరంగా పరిణమిస్తుంది, లక్ష్యచ్యుతమవుతుంది. యుద్ధం వల్ల సాధించదలచుకున్న లక్ష్యాన్ని ఖచ్చి తంగా నిర్వచించాలి. ఒకవేళ భారత్ పీఓకేను తిరిగి స్వాధీనం చేసుకోవడం, ఉగ్రవాద మౌలిక కేంద్రాలను ధ్వంసం చేయడం, పాకిస్తాన్ మిలిటరీ శక్తిని నాశనం చేయడం, అంతర్జాతీయంగా పాక్‌ను బహిష్కరించాలనే పరిస్థితి తేవడం వేరు.. యుద్ధం చేయడం వేరు.

### ఆర్థిక ప్రణాళికలు..

యుద్ధం వల్ల ఏర్పడే ఆర్థిక భారం ఎలా భరించాలన్న దానిపై ముందస్తు ప్రణాళిక ఉండాలి. యుద్ధం ఖర్చులు ఎంత ఉండబోతున్నాయో కచ్చితంగా అంచనా వేయాలి. ఒక్క యుద్ధ సంవత్సరం ఖర్చు కనీసం 8-9 లక్షల కోట్లు. ఇది జీడీపీకి సుమారు 3% అదనపు భారం. రక్షణ, పునర్నిర్మాణ వ్యయాలు, భద్రతా వ్యయం పెరుగుదల మొదలైన వాటిని సమర్థవంతంగా నిర్వహించే దిశగా ప్లాన్ ఉండాలి, దీనికి ముందస్తుగా బడ్జెట్ సిద్ధం చేయాలి, అవసరమైన చోట పెట్టుబడులు మళ్లించాలి.

### దాడి జరిగితే..

దేశంలో ప్రజల సహనం, మద్దతు, దేశభక్తిని నిలబెట్టుకునేలా ప్రభుత్వాలు ముందస్తుగా కార్యక్రమాలు రూపొందించాలి. విపక్షాలు, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా సహకరించేలా సమన్వయం కావాలి. దేశీయంగా మీడియా, సామాజిక మాధ్యమాల్లో ప్రజలను జాగ్రత చేయాలి. రేషన్ పంపిణీ, విద్యుత్, నీటి సరఫరాలపై ముందస్తు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలి. యుద్ధ ప్రభావిత ప్రాంతాల ప్రజలను ఇతర ప్రాంతాలకు సురక్షితంగా తరలించేందుకు ప్లాన్లు సిద్ధం చేయాలి. రేషన్ పంపిణీ వ్యవస్థ, వైద్య సేవలు, ప్రజల గమనికల కోసం ప్రత్యేక చర్యలు (జనరల్ మొబిలైజేషన్ ప్లాన్) సిద్ధంగా ఉండాలి. యుద్ధ సమయంలో నగరాలు, పరిశ్రమలు, విద్యుత్, నీటి సరఫరాలపై దాడులు జరిగితే వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ఉండాలి. సరిహద్దు రక్షణను బలపరచాలి. లైన్ ఆఫ్ కంట్రోల్ ద్వారా ముమ్మరంగా ఆక్రమణ ప్రణాళికలు సిద్ధం చేయాలి. ప్రత్యేక దళాల్ని ఉగ్రవాద మౌలిక కేంద్రాలపై దాడులకు సిద్ధం చేయాలి.

### యుద్ధం తర్వాత వ్యూహం ముఖ్యం!

విజయం సాధించిన తర్వాత కూడా పరిసర దేశాల్లో విధేయ ప్రభుత్వాలు ఏర్పరచడం, శాంతి నిలుపుదల దళాలను ఏర్పాటు చేయడం వంటి చర్యలు తీసుకోవాలి. లేకపోతే శూన్యతలో తిరిగి ఉగ్రవాద సంస్థలు, మిలిటెంట్లు విస్తరిస్తారు. పాకిస్తాన్ మిలిటరీ లేదా ఉగ్రవాద తిరుగుబాట్లు, పీఓకేలో స్వతంత్ర ఉగ్ర దళాల తిరుగుబాట్లు, పాక్ మిలిటరీ ఎత్తుగడలు తట్టుకోవడానికి ముందస్తు చర్యలు అవసరం. చైనా పాక్‌కు మద్దతుగా ముట్టడి చర్యలు తీసుకుంటే, ద్విపక్ష సంబంధాలు మరింత క్షీణించవచ్చు. ఆ ప్రమాదాన్ని తట్టుకోగల సన్నద్ధత ఉండాలి. యుద్ధం కారణంగా పెరిగిన ద్రవ్యోల్బణాన్ని, మందగించిన వృద్ధిని తిరిగి నిలబెట్టుకోవడానికి, ఆర్థిక సంస్కరణలు, విదేశీ పెట్టుబడుల పునర్నిర్మాణం, పారిశ్రామిక అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి అవసరం.

# సెలవులు వృధా చేయకుండా మీ పిల్లలకు సమ్మర్ వెకేషన్ ఇలా ప్లాన్ చేయండి!

ఈ ఏడాది సమ్మర్ వెకేషన్ రానే వచ్చింది. స్కూల్స్, కాలేజీస్‌కు హాలీడేస్ వచ్చినయ్. ఇక దాదాపు నెలన్నరకు పైగా పిల్లలకు సెలవులే. కొన్నేండ్ల క్రితం వరకు సెలవులంటే ఎగిరి గంతేసే వారు బడి పిల్లలు.. ఎండాకాలం సెలవులు వచ్చాయంటే అమ్మమ్మ ఇంటికో, నాయినమ్మ ఇంటికో వెళ్లి నెల, రెండేళ్లు సరదాగా గడిపేవారు. అదే ఇప్పుడు పట్నంలో ఉండే పిల్లలు ఊర్లకు పోదామంటే వద్దు అంటున్నరు. తాతయ్య, నాయనమ్మ ఊర్లకంటే వెంటనే నో చెప్పేస్తున్నరు. రోజూ ఆదివారం లాగే రోజంతా కూడా ఏసీలు ఆన్ చేసుకొని స్మార్ట్ ఫోన్లు, టీవీ, కంప్యూటర్, ల్యాప్ టాప్‌లతోనే గడుపుతారు. ఏదో ఈవీనింగ్ అలా పార్కు లేదా సినిమా, రెస్టారెంట్‌కు వెళ్లి వచ్చేస్తారు. అయితే ఈ వేసవి సెలవుల సమయంలో అంటే నెలన్నర రోజులలో పిల్లలకు ఏదైనా పనికొచ్చేది నేర్పిస్తే మంచిదని పలువురు మేధావులు అభిప్రాయపడుతున్నారు.

### సమయాన్ని వృధా చేయకుండా..

పిల్లలు మానసికంగా, శారీరకంగా దృఢంగా తయారవ్వాలంటే ఇండోర్, అవుట్ డోర్ గేమ్స్ నేర్పితే బాగుంటుంది. టెక్నికల్‌గా, ఎడ్యుకేషన్ పరంగా కూడా ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తే మంచిది. యోగా, మెడిటేషన్ వంటివి కూడా మానసిక ఉల్లాసానికి ఎంతగానో ఉపయోగపడతాయి. చిన్నారులకు ఇండోర్, ఔట్ డోర్ గేమ్స్‌లో ట్రైనింగ్ ఇప్పిస్తే బెటర్. క్రికెట్, వాలీబాల్, ఫుట్ బాల్, బ్యాడ్మింటన్, కరాటే, యోగా, కబడ్డీ, డ్యాన్సింగ్, పెయింటింగ్, కంప్యూటర్, ఏఐ టెక్నాలజీ, ఆన్‌లైన్ క్లాసులు వంటివి కోచింగ్ ఇప్పిస్తే శారీరకంగా, మానసికంగా దృఢంగా అవుతారు. అలాగే ఎడ్యుకేషనల్‌గా, టెక్నికల్‌గా కూడా ఎదిగేందుకు దోహదపడుతాయి.. అంతేగానీ ఇంట్లో ఏసీ, ఫ్యాన్‌లు ఆన్ చేసి స్మార్ట్ టీవీ/మొబైల్ ఇచ్చి ఆడుకోమని చెబితే, వైఫై పెట్టి కంప్యూటర్, ల్యాప్ టాప్ ఇచ్చేస్తే మీ బిడ్డల్ని మీరే చెడగొట్టిన వారు అవుతారు. ఈ నెలన్నర పాటు మీ బాబు లేదా పాపకు ఏం నేర్పించాలి.. దొరికిన ఈ ఖాళీ సమయాన్ని వృధా చేయకుండాఎలాఉపయోగించాలిఅని భార్యభర్తలు ఆలోచిస్తే మంచిది.



### కొన్ని పాఠశాలలు చేస్తున్నప్పటికీ..

తమ పాఠశాలల్లో చదువుకునే పిల్లలను మెరుగుపరచడంతో పాటు ఆర్థికంగా కూడా నిలదొక్కుకునేలా ఆయా స్కూల్స్ మేనేజ్‌మెంట్లు ఆలోచన చేస్తు న్నాయి. సమ్మర్ వెకేషన్ క్యాంపులు పెట్టి విద్యార్థులను అట్రాక్ట్ చేస్తున్నాయి. హాలీడేస్‌లో టైం వేస్ట్ చేస్తున్నారనే ఉద్దేశంతో కొత్తగా స్పెషల్ క్యాంపుల పేరుతో ఆటలు, పాటలు, డ్యాన్స్‌లతో పిల్లలను సంతోషపరిచే కార్యక్రమాలు చేపడుతున్నారు. కొంత మంది స్పెషలిస్ట్‌ల ద్వారా ఇండోర్, అవుట్ డోర్ గేమ్స్‌తో పాటు ఇతర యాక్టివీటిస్‌ను పిల్లలకు నేర్పించాలనే ఉద్దేశంతో ప్రోగ్రామ్స్ కండెక్ట్ చేస్తున్నాయి. కొన్ని ప్రైవేటు ఆర్గనైజేషన్లు, స్వచ్ఛంద సంస్థలు సైతం విద్యార్థుల కోసం సమ్మర్ క్యాంపుల పేరుతో సరికొత్త యాక్టివిటీస్ నేర్పుతున్నాయి. క్యారెం బోర్డు, చెస్, హాకీ, కీబోర్డ్, గిటార్ వంటి మ్యూజిక్‌లో ట్రైనింగ్ ఇచ్చేందుకు సిద్ధమయ్యాయి. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 వరకు వీలైన సమయాల్లో వచ్చి నేర్చుకోవచ్చంటూ ఆహ్వానిస్తున్నాయి. తల్లిదండ్రులు ఎండా కాలం సెలవుల్లో పిల్లలు సమయం వృధా చేయకుండా వారికి మీకు ఇష్టమున్న ఆటలు నేర్పిస్తే ఆరోగ్యంగా, దృఢంగా తయారయ్యే అవకాశం ఉంది.